సంపుటి : 18
సంచిక : 239
Vol : 18
Issue : 239

RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

పీపుల్స్‌డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, ఆదివారం 22 నవంబర్ 2026
Warangal, Sunday 22 November 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00



www.epaper.peoplesdairynews.com
www.peoplesdairynews.com

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, Nizamabad & TG All Districts

వీరభద్రుడి సాక్షిగా భూమాయ

నిజాలపై సోషల్ దాడి!

'పీపుల్స్‌డైరీ' కథనాలతో అక్రమార్కుల్లో గుటగుట

- ఎదురుదాడితో నిజాలు దాగుతాయా...?
- కురవిలో భూకబ్జా కోణాలు...
- పవర్‌సింగ్, మ్యాజిక్‌ఖాన్ తోడుదొంగలు!
- జిల్లాలో సర్వాంతర్యామిగా పవర్‌సింగ్ 'వేలు'
- వందల కోట్ల విలువైన భూమిపై నీలినీడలు...
- ఉన్నతస్థాయి అధికారులు రంగంలోకి దిగాల్సిందే...

2వ పేజీలో..

తాతల కాలం భూమి అంటారు.. పట్టా మాత్రం చూపించరు.. రికార్డుల్లో హక్కు ఉందంటారు.. జీవో 59లో రిజెక్ట్ అయితే జవాబు చెప్పరు! నాడు రెవెన్యూ బోర్డు పెట్టింది.. నేడు ఆ బోర్డు ఆనవాళ్లే లేవు.. అప్పుడు మౌనంగా ఉన్న గొంతులు.. పత్రికలో వార్త రాగానే సోషల్ మీడియాలో గర్జనలు!

852.. 177.. 747.. నెంబర్లు మూడు.. వాటి వెనుక దాగున్న భూ దోపిడీ కథలు ఎన్నో! ప్రజల ఆస్తి ప్రభుత్వ భూమి.. కబ్జాదారుల కళ్లలో మాత్రం బంగారు గని!

పవర్ సింగ్ అండలంటూ ఆరోపణలు.. మ్యాజిక్ ఖాన్ మాయలంటూ విమర్శలు.. జీపీఓ పాత్రపై జనంలో అనుమానాలు.. వీటన్నింటికీ సమాధానం చెప్పాల్సింది అధికార యంత్రాంగమే!

కలాన్ని ఆపగలరేమో కానీ.. కదులుతున్న ప్రశ్నలను ఆపగలరా? సోషల్ మీడియాలో ఎదురుదాడి చేయగలరేమో కానీ.. సర్వే నెంబర్లలోని నిజాలను చెరిపేయగలరా?





కలల కొలువులో కోతల కత్తులు

2వ పేజీలో..

ఏఐ వేగానికి ఆవిరవుతున్న ఉద్యోగాలు..
ఐటీ రంగంలో ప్రకంపనలు....
కన్నీటి పర్యంతమవుతున్న కుటుంబాలు..
ఉద్యోగులపై లేఆఫ్ పిడుగు.
సాఫ్ట్‌వేర్ రంగంలో అభద్రత

కానీ కాలం మారింది.. కంపెనీల లెక్కలు మారాయి.. ఉద్యోగుల బతుకులు తలకిందులయ్యాయి.. నిన్నటి భరోసా నేడు ప్రశ్నార్థకమైంది! ఎప్పుడు వస్తుందో తొలగింపు మెయిల్.. ఎప్పుడు కూలుతుందో ఉద్యోగపు గోడ.. తెలియని రేపటి కోసం ఎదురుచూపులు.. గుండెల్లో గుబులు.. కళ్లలో కన్నీళ్లు! ఒకనాడు సాఫ్ట్‌వేర్ కొలువంటే కుటుంబానికి కొండంత భరోసా.. నెలనెలా చేతికందే ఐదెంకెల సాలరీతో లగ్జరీ లైఫ్... ఒకవైపు వేలాది కొలువులకు కోత.. మరోవైపు కొత్త నియామకాల బాట.. ఎవరికీ దక్కుతుందో ఉద్యోగ భాగ్యం.. ఎవరి ఇంట మిగులుతుందో విషాద రాగం!



11వ పేజీలో..

భారతీయ రుచులు భళా..

అంతర్జాతీయ వేదికపై మన వంటకాల సత్తా...

టాప్ టెన్‌లో చోటుదక్కించుకున్న రెండు వంటకాలు

కూరల ఖ్యాతి ఖండాంతరాలు!

ప్రముఖ ఫుడ్‌గైడ్ టేస్ట్ అట్లాస్ విడుదల

రాజగోపాల్‌రెడ్డిపై అధిష్టానం సీరియస్?

ఈనెల 23న కలవాలంటూ ఆదేశాలు ■ రాజగోపాల్‌రెడ్డికి హైకమాండ్ ఫోన్!

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్టానం సీరియస్ అయినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆయనకు హైకమాండ్ నుంచి ఫోన్ కాల్ వచ్చినట్ట సమాచారం. రాజగోపాల్ రెడ్డికి ఫోన్ చేసిన ఏఐసీసీ కార్యదర్శి.. ఈ నెల 23న కొత్త ఇన్‌ఛార్జ్ బీఎం సందీప్‌తో సమావేశం కావాలని సూచించారు. ఇదిలా ఉండగా, రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువైందని, రాజగోపాల్ రెడ్డి, అనిరుద్ రెడ్డిపై వ్యాఖ్యలను

(మిగతా 2లో...)

2వ పేజీలో..

అవినీతి అధికారిపై వేటు సరే.. ఆ 89 అక్రమ సభ్యత్వాల మాటేంటి.?

చేపలు పట్టే చేతులకు న్యాయం దూరమైంది, అడ్డదారిన వచ్చిన వారికి అదృష్టం తోడైంది! చెమటోడ్చి వేట సాగించే అసలైన మత్స్యకారుడికి అన్యాయం, అనర్హులకు మాత్రం సంక్షేమ పథకాల సందడి!

89 మంది పేర్లతో అక్రమాల ముద్ర పడినా, ఆ జాబితా చెరిపేందుకు ఎందుకీ మౌనం? తప్ప చేసిన అధికారి సస్పెండ్ అయితే సరిపోతుందా? తప్పుడు సభ్యత్వాల పునాదులను కూల్చేదెవరు? అక్రమాలకు అండగా నిలుస్తున్న అదృశ్య శక్తులెవరు? అధికారులపై చర్యలతోనే అవినీతి అంతమవుతుందా? అక్రమ లబ్ధిదారుల ఏరివేత ఎప్పుడు మొదలవుతుంది?

చేపల వేట మా బతుకు.. సభ్యత్వం మా హక్కు, అక్రమాల తొలగింపే మాకు కావాలి న్యాయం! 89 అక్రమ సభ్యత్వాలకు చరమగీతం పాడండి, అసలైన మత్స్యకారుల కన్నీళ్లకు న్యాయం చేయండి!

- ఖమ్మం జిల్లా మత్స్యశాఖలో 'కోమట్లగూడెం' సభ్యత్వాల రగడ..!
- నిబంధనల ఉల్లంఘనతో ఇన్‌చార్జ్ అధికారి సస్పెన్షన్..
- తప్ప జరిగిందని తేలినా.. అక్రమ సభ్యత్వాల రద్దుపై మీనమేషాలు..
- ఆందోళనలో అసలైన మత్స్యకారులు..!

అమెరికాలో రోడ్డు ప్రమాదం

- తెలంగాణ యువకుడు దుర్మరణం
- వారం రోజుల కిందటే ఉద్యోగం..
- ఇంతలోనే విషాదం..
- మృతుడు నల్గొండకు చెందిన యువకుడు



11లో

పీపుల్స్‌డైరీ-నెట్‌వర్క్ : అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఉన్నత విద్య కోసం వెళ్లిన నల్గొండ జిల్లా మునుగోడుకు చెందిన వీరమళ్ల సాయితేజ (25) చదువు పూర్తికావడంతో ఇటీవలే అక్కడ ఉద్యోగం సాధించాడు. వారం రోజుల కిందటే ఉద్యోగం రావడంతో తల్లిదండ్రులు, ఆనందంలో ఉండగా.. ఇంతలోనే ఊహించని ప్రమాదం ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. న్యూయార్క్‌లోని హైవేపై బుధవారం రాత్రి సాయితేజ కారులో ప్రయాణిస్తుండగా.. అకస్మాత్తుగా ఓ జింక అడ్డుగా వచ్చింది. (మిగతా 2లో...)

కల్తీ మద్యం కాటు..

- 13 మంది మృతి... మరో 300 మందికిపైగా అస్వస్థత
- మణిపూర్‌లో ఘోర విషాదం..

2లో



పీపుల్స్‌డైరీ

వరంగల్

ఆదివారం, 22 నవంబర్ 2026

సంపుటి : 18, సంచిక : 239

వీరభద్రుడి సాక్షిగా భూమాయ...

నిజాలపై 'సోషల్' దాడి..

పీపుల్స్‌డైరీ-మహబూబాబాద్ నిఘా టీం : కురవి మండలంలో ప్రభుత్వ భూములు మాయమవుతున్నాయి. ఒక్కో సర్వే నెంబర్.. ఒక్కో కథ. ఒక్కో ఫైల్.. ఒక్కో మాయాజాలం. ఈ దోపిడీపై "పీపుల్స్‌డైరీ" దినపత్రిక వరుస కథనాలు రాస్తుంటే.. ఇప్పుడు కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. అందుకే 747 అనగానే.. సోషల్ మీడియాలోకి వచ్చి.. "అది మా భూమి.." అని అరుస్తున్నారు. కానీ ప్రజలు అడుగుతున్నది ఒక్కటే.. నిజమైతే భయం ఎందుకు..? తప్పు చేయకపోతే.. పేపర్ వార్తకు ఉలిక్కిపడటం ఎందుకు..?

852, 177, 747.. మూడు నెంబర్లు.. వందల కోట్ల కథ..!

కురవిలో 852, 177, 747.. ఈ మూడు సర్వే నెంబర్లలోనే వందల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాలో ఉందని "పీపుల్స్ డైరీ" బయటపెట్టింది. 747 గురించి రాయగానే స్పందించిన వారు.. 177, 852 గురించి ఎందుకు నోరు మెదపడం లేదు..? అక్కడ కూడా ప్రభుత్వ భూమి లేదా..? అక్కడ మాట్లాడితే ఏం బయటపడుతుందని భయం..?

ఒక నెంబర్ మీదే అరిస్తే.. మిగతా రెండు నెంబర్లు దాచేసినట్లు కాదా..? 747లో నిజం ఉంటే.. 177, 852 లో కూడా నిజం ఉండదా..? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మూడు నెంబర్లలో జరిగింది ఒకటే తంతు అయితే.. ఒక్కదానిపైనే ఎందుకు స్పందన..? మిగతా రెండు వదిలేస్తే.. కబ్జా పూర్తి అవుతుందని అనుకుంటున్నారా..?

తండ్రుల కాలం భూమి.. అంటే.. జీవో 59 లో ఎందుకు రిజెక్ట్..?

747 మా తండ్రుల కాలం నుండి ఉన్న భూమి అని ఇప్పుడు చెబుతున్న వారు.. అసలు నిజం చెప్పాలి. అదే భూమి.. 59 జీవోలో పెట్టుకుంటే ఎందుకు రిజెక్ట్ అయింది..? అప్పుడు అధికారులు ఏం చూసి రిజెక్ట్ చేశారు..? ప్రభుత్వ భూమి అని తేలితేనే కదా రిజెక్ట్ చేసింది..? తండ్రుల కాలం భూమి అయితే.. పట్టా ఎందుకు లేదు..? రికార్డు ఎందుకు లేదు..? జీవో 59 లో ఎందుకు పెట్టుకోవాల్సి వచ్చింది..? అని ప్రజలు నిలదీస్తున్నారు.

అప్పుడు ప్రభుత్వ భూమి అని చెప్పిన రెవెన్యూ.. ఇప్పుడు పట్టా భూమి అని ఎలా చెబుతోంది..? అప్పటికి ఇప్పటికి భూమి మారిందా..? లేక ఫైలు మారిందా..? లేక చేతులు మారిన కాసులు మార్చాయా..? అప్పుడు రిజెక్ట్.. ఇప్పుడు పట్టా.. ఈ మాయాజాలం వెనుక ఎంత ముట్టింది..? ఎవరికి ముట్టింది..? ఎవరి ద్వారా ముట్టింది..? అనేది విచారణ చేస్తేనే తేలుతుంది.

రిజెక్ట్ అయిన ఫైల్ ను బయటకు తీస్తే.. చాలా నిజాలు బయటకు వస్తాయని.. అందుకే ఆ ఫైల్ ను దాచేస్తున్నారని ప్రజలు అనుమానిస్తున్నారు.

బోర్డు పెట్టినప్పుడు ఎక్కడికి పోయారు..?

747 లో ప్రభుత్వ భూమి ఉందని రెవెన్యూనే ఒప్పుకుంది. అందుకే బోర్డు పెట్టింది. ప్రభుత్వ భూమి కాకపోతే.. రెవెన్యూ అధికారులు బోర్డు ఎందుకు పెట్టారు..? ఊరికే పెట్టారా..? సరదాకు పెట్టారా..?

బోర్డు పెట్టినప్పుడు.. "ఇది మా భూమి.." అని చెబుతున్న వారు ఏం చేశారు..? ఎందుకు అడ్డుకోలేదు..? ఎందుకు కోర్టుకు పోలేదు..? ఎందుకు ఫిర్యాదు చేయలేదు..? ఎందుకు అధికారులను నిలదీయలేదు..?

బోర్డు పెట్టినప్పుడు మౌనం.. పేపర్లో వార్త వస్తే గోల.. ఇదేంటి..? నిజం చెప్పాలంటే భయమా..? లేక లెక్క తేడా కొడుతుందని భయమా..? బోర్డును ఎవరు తొలగించారు..? తొలగించిన వారికి సహకరించింది ఎవరు..? బోర్డు మాయమైనా అధికారులు ఎందుకు చూస్తూ ఊరుకున్నారు..? అనే ప్రశ్నలకు ఇప్పటి వరకు సమాధానం లేదు.

కురవి కబ్జా వెనుక జీపీఓ...?

కురవిలో భూముల కబ్జాకు ఒక జీపీఓ ముందుండి నడిపిస్తున్నాడని మండలంలో బలంగా వినిపిస్తోంది. జీపీఓ అంటే పంచాయతీకి పెద్ద దిక్కు. ప్రజల భూమిని కాపాడాల్సిన వ్యక్తే.. భూమిని మాయం చేస్తుంటే.. ప్రజలు ఎవరిని నమ్మాలి..? పంచాయతీ భూమి.. ప్రభుత్వ భూమి.. ఇవన్నీ ప్రజల సొత్తు. వాటిని కాపాడాల్సిన వ్యక్తే.. కబ్జాకు నాయకత్వం వహిస్తే.. ఇక మండలం పరిస్థితి ఏంటి? అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆ జీపీఓ వెనుక పవర్ సింగ్ అండ ఉందని.. ఇద్దరి మధ్య పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయని గుసగుసలు కాదు.. బహిరంగ చర్చే జరుగుతోంది. పవర్ సింగ్ అండ లేకుండా.. జీపీఓ ఇంత ధైర్యంగా వ్యవహరిస్తాడా..? అధికారులు ఇంత మౌనంగా ఉంటారా..? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కలెక్టరేట్ లో మ్యాజిక్ ఖాన్ మ్యాజిక్..!

ఇక్కడే అసలు ట్విస్ట్. పవర్ సింగ్‌కి కలెక్టరేట్‌లో మ్యాజిక్ ఖాన్ తోడు. ఫైలు కదలాలంటే మ్యాజిక్ ఖాన్.. ఫైలు ఆగాలంటే మ్యాజిక్ ఖాన్.. ఫైలు మాయం కావాలంటే మ్యాజిక్ ఖాన్.. అన్నట్లుగా కలెక్టరేట్‌లో పరిస్థితి ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రతి ఫైల్ లో వీళ్ళ చేతివాటం ఉంటుందని.. ప్రభుత్వ భూమి చేజారిపోవడంలో వీళ్ళ పాత్రే కీలకమని జిల్లా ప్రజలు అంటున్నారు. కలెక్టరేట్ లో కూర్చొని.. ప్రభుత్వ భూముల ఫైళ్లతో మ్యాజిక్ చేస్తే.. కురవి భూములు మిగులుతాయా..? ఫైళ్లు తిరగరాస్తే.. ప్రజల భూములు పట్టా భూములు అవుతాయా..? మ్యాజిక్ ఖాన్ మ్యాజిక్ తో.. రిజెక్ట్ అయిన ఫైల్.. పట్టా ఫైల్ గా మారుతుందా..? అని జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది.

దినపత్రికపై ఎదురుదాడి చేస్తే నిజం దాగదు..!

పీపుల్స్ డైరీ వరుస కథనాలు రాస్తుంటే.. కొందరు సోషల్ మీడియాలో ఎదురుదాడి చేస్తున్నారు. దినపత్రిక తప్పుడు వార్తలు రాస్తుందని అంటున్నారు. కానీ దినపత్రిక రాసింది తప్పైతే.. ఆధారాలతో నిరూపించాలి. రికార్డులు చూపించాలి. జీవో 59 ఫైల్ చూపించాలి. బోర్డు ఎందుకు పెట్టారో చెప్పాలి.

అలా కాకుండా.. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి.. బెదిరింపులకు దిగితే.. నిజం దాగదు. పైగా అనుమానం ఇంకా పెరుగుతుంది.

ప్రజలు కోరుతున్నది ఒక్కటే.. విచారణ....

కురవి మండలంలోని ప్రభుత్వ భూములపై పూర్తి విచారణ జరపాలి. 747, 177, 852.. మూడింటిపై సర్వే చేయాలి. జీవో 59 లో రిజెక్ట్ అయిన ఫైళ్లను బయటకు తీయాలి. బోర్డు ఎవరు పెట్టారు..? ఎవరు తొలగించారు..? ఎవరు సపోర్ట్ చేశారు..? జీపీఓ పాత్ర ఏంటి..? పవర్ సింగ్ పాత్ర ఏంటి..? మ్యాజిక్ ఖాన్ పాత్ర ఏంటి..? అనేది తేల్చాలి.

కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలతో పాటు.. జిల్లా ప్రజలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పీపుల్స్ డైరీ రాసినంత మాత్రాన.. సోషల్ మీడియాలో ఎదురుదాడి చేస్తే.. నిజం దాగదు. నిజం ఎప్పటికైనా బయటకు వస్తుంది..! ఉన్నతాధికారులు ఇప్పటికైనా మేల్కొని.. కురవి భూములను కాపాడాలి.. లేకపోతే రేపు కురవిలో ప్రభుత్వ భూమి అనేది కేవలం రికార్డుల్లోనే మిగిలిపోతుంది..!

'89' ఏరివేయండి..

అవినీతి అధికారిపై వేటు సరే.. ఆ 89 అక్రమ సభ్యత్వాల మాటేంటి.?

- ఖమ్మం జిల్లా మత్స్యశాఖలో 'కోమట్లగూడెం' సభ్యత్వాల రగడ..!
- నిబంధనల ఉల్లంఘనతో ఇన్‌చార్జ్ అధికారి సస్పెన్షన్..
- తప్పు జరిగిందని తేలినా.. అక్రమ సభ్యత్వాల రద్దుపై మీనమేషాలు..

■ ఆందోళనలో అసలైన మత్స్యకారులు..!

ఖమ్మం, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : నిబంధనలను తుంగలో తొక్కి అక్రమంగా 89 సభ్యత్వాలు జారీ చేసిన అధికారిపై ప్రభుత్వం వేటు వేసింది.. కానీ ఆ అధికారి అక్రమంగా కట్టబెట్టిన 89 మంది సభ్యత్వాలను మాత్రం ఇప్పటికీ రద్దు చేయకపోవడం ఖమ్మం జిల్లా మత్స్య శాఖలో చర్చనీయాంశంగా మారింది.. తప్పు జరిగిందని విచారణలో తేలినప్పటికీ, ఆ అక్రమ సభ్యత్వాలు ఇంకా కొనసాగుతుండటంపై అసలైన మత్స్యకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

నిబంధనలకు విరుద్ధంగా 'టి- మత్స్య' పోర్టల్ యాప్ లో పేర్లు నమోదు..

ఖమ్మం జిల్లా చింతకాని మండలం కోమట్లగూడెం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా 89 మందికి అక్రమంగా కొత్త సభ్యత్వాలు జారీ అయ్యాయి.. గతంలో జిల్లా ఇన్‌చార్జ్ మత్స్యశాఖ అధికారిగా పనిచేసిన ఆంజనేయస్వామి, కనీస నిబంధనలు పాటించకుండా 'టీ-మత్స్య' పోర్టల్ యాప్‌లో వీరి పేర్లను నమోదు చేశారు..

నిబంధనల ప్రకారం..

కొత్తగా సభ్యత్వం కావాలంటే స్థానిక సంఘం కమిటీ తీర్మానం ఉండాలి.. ఆ తర్వాత అభ్యర్థులకు ఈత కొట్టడం, తెప్పపై నుంచి వల విసరడం, వల లాగడం వంటి నైపుణ్య పరీక్షలు నిర్వహించి, రాష్ట్ర డైరెక్టర్ ఆమోదం పొందాకే సభ్యత్వం ఇవ్వాలి.. కానీ కోమట్లగూడెం సొసైటీ విషయంలో ఇవేవీ జరగలేదని, అర్హత లేని వారిని దొడ్డిదారిన చేర్చారని సోసైటీ సంఘం ప్రతినిధులు, ముదిరాజ్ సంఘం నేతలు మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్సీ బండ ప్రకాష్, బిజెపి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్, మత్స్య శాఖ డైరెక్టర్ నిఖిలకు ఫిర్యాదు చేశారు..

సస్పెన్షన్‌తో సరి....

'పీపుల్స్ డైరీ' పత్రికలో ప్రచురించిన వాస్తవ, వరుస కథనాలతో, మత్స్యకారుల ఫిర్యాదుతో డిప్యూటీ డైరెక్టర్ సుజాత విచారణ జరిపి, సభ్యత్వాల జారీలో అక్రమాలు జరిగినట్లు నిర్ధారిస్తూ నివేదిక ఇచ్చారు.. ఈ నివేదిక ఆధారంగా అప్పటి ఇన్‌చార్జ్ అధికారి ఆంజనేయస్వామిని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు..

89 నకిలీ సభ్యత్వాలు రద్దు చేయరా...?

అక్రమంగా సభ్యత్వాలు ఇచ్చిన అధికారిని సస్పెండ్ చేసినప్పుడు, ఆ అక్రమ ప్రక్రియ ద్వారా పొందిన 89 సభ్యత్వాలను కూడా తక్షణమే రద్దు చేయాలి. కానీ అధికారిపై చర్యలు తీసుకున్న యంత్రాంగం, ఆ సభ్యత్వాల రద్దు విషయంలో మాత్రం మౌనం వహిస్తోంది..

అర్హులకు అన్యాయం..

మత్స్య సహకార సంఘంలో సభ్యత్వం ఉంటేనే ప్రభుత్వ రాయితీ వాహనాలు, వలలు, చేప పిల్లల పంపిణీ, రూ.5 లక్షల ప్రమాద బీమా వంటి సంక్షేమ పథకాలు అందుతాయి.. అక్రమంగా చేరిన 89 మంది జాబితాలో కొనసాగితే, తరతరాలుగా చేపల వేటనే నమ్ముకున్న అసలైన మత్స్యకారుల వాటాకు గండి పడే ప్రమాదం ఉంది..

గతంలోనూ ఇదే తీరు..

2021లోనూ జిల్లాలో 60 మందికి అక్రమంగా సభ్యత్వాలు ఇచ్చిన వ్యవహారంలో అప్పటి అధికారి సస్పెండ్ అయ్యారు.. ఇలా అధికారులపై చర్యలు తీసుకుంటున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో అక్రమ లబ్ధిదారుల ఏరివేత జరగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.. జిల్లాలో దాదాపు 2000 మంది నిజమైన మత్స్యకారులు సభ్యత్వాల కోసం ఏళ్లతరబడి ఎదురుచూస్తుంటే, అడ్డదారిలో వచ్చిన 89 మందిని ఇంకా కొనసాగించడం ఏంటని మత్స్యకార సంఘాలు, ముదిరాజ్ నేతలు ప్రశ్నిస్తున్నారు.. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, సస్పెండ్ అయిన అధికారి జారీ చేసిన 89 అక్రమ సభ్యత్వాలను రద్దు చేసి, అర్హులైన మత్స్యకారులకు న్యాయం చేయాలని ముదిరాజ్ సంఘం నేతలు, జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు..

కలల కొలువులో కోతల కత్తులు..

(మొదటి పేజీ తరువాయి)

పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ : ఒకప్పుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగమంటే జీవితానికి భరోసా... లగ్జరీ లైఫ్‌కు కేరాఫ్... లక్షల్లో జీతాలు, సొంత ఇల్లు, పిల్లలకు నాణ్యమైన చదువులు, కుటుంబానికి ఆర్థిక భద్రత.. ఇలా మధ్యతరగతి కలలకు ఐటీ రంగం ఒక మార్గంగా నిలిచింది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పుణె వంటి నగరాల్లో వేలాది కుటుంబాలు ఈ ఉద్యోగాల ఆధారంగానే భవిష్యత్తును నిర్మించుకున్నాయి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారుతోంది. చేతిలో ఉద్యోగం ఉన్నా రేపు ఉంటుందో లేదో తెలియని అనిశ్చితి నెలకొంది. ఎప్పుడు తొలగింపు వేటు పడుతుందోనన్న భయం ఉద్యోగులను వెంటాడుతోంది. ఒకప్పుడు నియామకాల కోసం పోటీపడిన కంపెనీలే ఇప్పుడు సిబ్బందిని తగ్గించుకునే బాట పట్టాయి.

క్వాల్‌కామ్, ఇంటెల్, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలతోపాటు విప్రో, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్‌టెక్, టెక్ మహీంద్రా వంటి భారతీయ సంస్థల్లోనూ ఉద్యోగుల పునర్వ్యవస్థీకరణ కొనసాగుతోంది. మరోవైపు కొన్ని సంస్థలు కొత్త నియామకాలు చేపడుతున్నాయి. ఈ పరిణామాలు ఐటీ రంగంలో చోటుచేసుకుంటున్న నిర్మాణాత్మక మార్పులకు సంకేతంగా నిలుస్తున్నాయి.



ప్రపంచవ్యాప్తంగా తొలగింపుల ప్రకంపనలు

నవంబర్ 18 నాటికి అందుబాటులో ఉన్న అంతర్జాతీయ లేఆఫ్ ట్రాకర్ గణాంకాల ప్రకారం.. 2026లో ఇప్పటివరకు 365 టెక్నాలజీ కంపెనీల్లో 1,59,418 మంది ఉద్యోగాలు కోల్పోయారు. 2025లో ఇదే కాలంతో పోలిస్తే ఈ సంఖ్య 36.6 శాతం అధికం. ఈ గణాంకాలు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ కోతల తీవ్రతను స్పష్టం చేస్తున్నాయి.

అమెరికాకు చెందిన క్వాల్‌కామ్‌లోనూ తొలగింపుల ప్రక్రియ ప్రారంభమైంది. సంస్థ సీఈవో క్రిస్టియానో అమెన్ అక్టోబర్ 20న ఉద్యోగులకు పంపిన సందేశంలో దీన్ని 'పెర్ఫార్మెన్స్ ఫోకస్డ్ రిడక్షన్'గా పేర్కొన్నారు. భవిష్యత్తు అవసరాలు, ఉద్యోగుల నైపుణ్యాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

భారత్‌లోనూ ఉద్యోగులపై వేటు

మనీ కంట్రోల్ నవంబర్ 11న వెల్లడించిన సమాచారం ప్రకారం.. క్వాల్‌కామ్ బెంగళూరు, హైదరాబాద్ కార్యాలయాల్లో ఉద్యోగుల తొలగింపులు ప్రారంభమయ్యాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్, చెన్నై కేంద్రాలకూ విస్తరించే అవకాశముంది. దేశవ్యాప్తంగా వెయ్యి మందికి పైగా ఉద్యోగులు ప్రభావితమవుతారని పరిశ్రమ వర్గాల అంచనా. అయితే ఈ సంఖ్యను సంస్థ అధికారికంగా ధ్రువీకరించలేదు.

ఇంటెల్‌లోనూ పునర్వ్యవస్థీకరణ కొనసాగుతోంది. ఖర్చులు తగ్గించడం, నిర్వహణ స్థాయిలను కుదించడం, ప్రాధాన్యం లేని ప్రాజెక్టుల నుంచి వనరులను మళ్లించడం వంటి చర్యలను సీఈవో లిప్-బు టాన్ చేపట్టారు. నవంబర్ 17, 18 తేదీల్లో మరో విడత ఉద్యోగ కోతల వార్తలు వెలువడ్డాయి. తాజా విడతలో ఎంతమంది ప్రభావితమయ్యారో వెల్లడికాలేదు. సెప్టెంబర్ చివరికి సంస్థ ఉద్యోగుల సంఖ్య 81,100కు పడిపోయింది. 2025 చివరినాటికి ఈ సంఖ్య 85,100గా ఉంది.

ఏఐ దిశగా కంపెనీలు.. ఉద్యోగులకు గుబులు

కృత్రిమ మేధస్సు (ఏఐ) రంగంలో భారీ పెట్టుబడులు పెడుతున్న గూగుల్ కూడా ఉద్యోగుల విషయంలో వ్యూహాత్మక మార్పులు చేస్తోంది. కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, స్విట్జర్లాండ్ వంటి దేశాల్లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పథకాలను అమలు చేస్తోంది. అయితే గూగుల్ క్లౌడ్, డీప్‌మైండ్ వంటి కీలక విభాగాలకు మినహాయింపు ఇచ్చింది. అంటే భవిష్యత్తులో అవసరమైన విభాగాలకు ఉద్యోగులను పరిమితం చేస్తూ వనరులను మళ్లిస్తోంది.

మైక్రోసాఫ్ట్ జూలై 2026లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 4,800 ఉద్యోగాలను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇది సంస్థ ఉద్యోగుల్లో 2.1 శాతం. అదే సమయంలో గత ఏడాది కాలంలో 4,000 మందికి పైగా ఉద్యోగులను ఇతర విభాగాలకు బదిలీ చేసింది. అక్టోబర్‌లో ప్రపంచవ్యాప్తంగా 60 వేల మంది ఉద్యోగులకు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ ఆఫర్‌ను కూడా ప్రకటించింది.

మొత్తంగా ఐటీ రంగంలో ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. ఏఐ వినియోగం, వ్యయ నియంత్రణ, కొత్త నైపుణ్యాలకు పెరుగుతున్న ప్రాధాన్యం కంపెనీల విధానాలను మార్చేస్తున్నాయి. అనుభవం, అధిక జీతం ఉన్నా ఉద్యోగానికి భరోసా లేని పరిస్థితి ఏర్పడుతోంది. కాలానికి అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోని వారికి భవిష్యత్తులో గడ్డు పరిస్థితులు తప్పేలా లేవు. ఒకప్పుడు మధ్యతరగతి కుటుంబాలకు భరోసా ఇచ్చిన ఐటీ కొలువులే ఇప్పుడు అభద్రతకు చిరునామాగా మారుతున్నాయి.

కల్తీ మద్యం కాటు...

- 13 మంది మృతి... మరో 300 మందికిపైగా అస్వస్థత
- మణిపూర్‌లో ఘోర విషాదం..

పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ : మణిపూర్‌లో కల్తీ మద్యం సేవించి వందల మంది అస్వస్థతకు గురికాగా.. వీరిలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన చందేల్ జిల్లాలో చోటుచేసుకుంది. కల్తీ మద్యం సేవించిన ఘటనలో నవంబర్ 18 నుంచి ఇప్పటివరకు కనీసం 13 మంది మరణించగా, 300 మందికి పైగా ఆసుపత్రుల పాలయ్యారని పోలీసులు తెలిపారు. బాధితులలో ఎక్కువ మంది చక్పికరోంగ్, పరిసర ప్రాంతాలకు చెందినవారని, వీరిని ఇంఫాల్‌లోని జేఎన్ఐఎంఎస్, రిమ్స్, షిజా, బబినా ఆసుపత్రులతో సహా పలు వైద్య కేంద్రాలలో చేర్పించినట్లు సమాచారం.

"కల్తీ మద్యంలో అనుమానిత మిథనాల్ విషప్రయోగం కారణంగా శుక్రవారం రాత్రి 9 గంటల వరకు 13 మంది మరణించినట్లు నివేదించారు.. అలాగే మరో 346 మంది ఆసుపత్రులలో చేరారు" అఒక అధికారి పీటీఐకి తెలిపారు. ఈఘటనపై మణిపూర్ ముఖ్యమంత్రి యమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్ స్పందించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు.



సోషల్ మీడియాలో దీనిపై పోస్ట్ చేసిన సీఎం "చందేల్ జిల్లాలోని చక్పికరోంగ్ ప్రాంతంలో కల్తీ మద్యం సేవించి అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నాను" అని తెలిపారు. అటు, చందేల్ జిల్లా యంత్రాంగం అత్యవసర సహాయక చర్యలను ముమ్మరం చేసిందని, పరిస్థితిని సమన్వయంతో పర్యవేక్షించడానికి ఒక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది.

రాజగోపాల్‌రెడ్డిపై అధిష్టానం సీరియస్?

(మొదటి పేజీ తరువాయి)

ఏఐసీసీ పరిశీలన చేయనుందని తెలిపారు. క్రమశిక్షణ చర్యలపై స్పందించి, సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. కొండా సురేఖ విషయంలో మొదటిసారి చర్యలు తీసుకోలేదని, రెండు మూడుసార్లు పరిశీలించిన తర్వాత అధిష్టానం చర్యలు తీసుకుందన్నారు.

ఇటీవల ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చేసిన వీడియోలు వైరల్ అయ్యాయి. తన నియోజకవర్గానికి నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అభివృద్ధి అంటే కేవలం కొడంగల్, మధిర, హుజూర్‌నగర్ నియోజకవర్గాలే కాదని దుయ్యబట్టారు. మునుగోడు అభివృద్ధిని పట్టించుకోవడం లేదని రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు.

అంతేకాదు, నిధులు ఇవ్వకుంటే మరో కురుక్షేత్రం తప్పదని ఆయన హెచ్చరించారు. ఇదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి మరో రెండేళ్లే పదవిలో ఉంటారని వ్యాఖ్యలు చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అలాగే, అదృష్టం కొద్దీ దక్కిన అధికారంతో అవినీతికి పాల్పడే పాలకులను తెలంగాణ ప్రజలు, చరిత్ర ఎన్నటికీ క్షమించదని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. సిద్ధిపేట సభలో సీఎం రేవంత్ రెడ్డి తనను ఉద్దేశించి పరోక్షంగా చేసిన వ్యాఖ్యలకు ఆయన పై విధంగా కౌంటర్ ఇచ్చారు.

ఇదిలా ఉండగా, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జిగా నియమితులైన బి.ఎం.సందీప్ ఆదివారం(నవంబరు 22న) హైదరాబాద్‌కు రానున్నారు. గాంధీభవన్‌లో జరగనున్న రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ), ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ)ల ఉమ్మడి సమావేశంలో ఆయన పాల్గొంటారు. తర్వాత నవంబరు 23న సోమవారం గాంధీభవన్‌లో ఉదయం మంత్రులతో, మధ్యాహ్నం నుంచి డీసీసీ అధ్యక్షులు, పీసీసీ అనుబంధ సంఘాల అధ్యక్షులతో సమావేశమవుతారు.

పీపుల్స్‌డైరీ
వరంగల్
ఆదివారం, 22 నవంబర్ 2026
సంపుటి : 18, సంచిక : 241
3

ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలేనా..ప్రజల హక్కులకు రక్షణ ఎక్కడ?

- **ఓటు వేసిన ప్రజలకు పాలకులపై ప్రశ్నించే హక్కు లేదా? ప్రజాస్వామ్యానికి అసలైన పరీక్ష అధికారంలో కాదు.. ప్రజల స్వేచ్ఛలో ఉంది!**

ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకోసారి ఓటు వేయడమా? రాజకీయ నాయకులకు అధికారం అప్పగించి, ఆ తర్వాత ప్రజలు మౌనంగా ఉండటమేనా? ఎన్నికల్లో గెలిచినవారికి ప్రజల జీవితాలపై సర్వాధికారాలు సంక్రమిస్తాయా? ఓటు వేసిన మరుక్షణమే ప్రజల హక్కులు ముగిసిపోతాయా? ఇవి నేటి ప్రజాస్వామ్య వ్యవస్థ ముందు నిలబడుతున్న అత్యంత కీలకమైన ప్రశ్నలు. ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికల ప్రక్రియ కాదు. అది ప్రజల స్వేచ్ఛకు భరోసా, హక్కులకు రక్షణ, పాలకుల జవాబుదారీతనానికి పునాది. కానీ నేడు ప్రజాస్వామ్యానికి ఎన్నికల రంగు అద్దుతూ, ప్రజల గొంతుకకు సంకెళ్లు వేసే ప్రమాదకర ధోరణులు కనిపిస్తున్నాయి.భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికీ సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, గౌరవప్రదమైన జీవితం వంటి ప్రాథమిక విలువలను హామీ ఇచ్చింది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు పాలకులు ప్రసాదించిన వరాలు కావు. అవి పౌరులకున్న రాజ్యాంగబద్ధమైన హక్కులు. భావప్రకటన స్వేచ్ఛ, ప్రశ్నించే హక్కు, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు, విపక్షకు వ్యతిరేకంగా పోరాడే హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువులు. అయితే ప్రభుత్వ విధానాలను విమర్శిస్తే దేశద్రోహులుగా చిత్రీకరించడం, ప్రశ్నిస్తే అభివృద్ధి నిరోధకులుగా ముద్ర వేయడం, నిరసన తెలిపితే శత్రువులుగా చూడడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం.

అధికారం ప్రజల నుంచి పుడుతుంది. కానీ అధికారం చేతికొచ్చిన తర్వాత ప్రజలే తమకు జవాబు చెప్పాలనే అహంకారం పాలకుల్లో పెరగకూడదు. ప్రజలు ప్రభుత్వానికి బానిసలు కాదు. ప్రభుత్వం ప్రజలకు సేవకురాలు. ఈ మౌలిక సత్యాన్ని మరచిపోయిన క్షణమే ప్రజాస్వామ్యం ప్రజల చేతుల్లోంచి జారిపోయి అధికార కేంద్రీకరణకు బలవుతుంది. ప్రజల కోసం రూపొందించాల్సిన విధానాలు కొందరి ప్రయోజనాలకు అనుగుణంగా మారితే, ప్రజల సంక్షేమం పేరుతో తీసుకునే నిర్ణయాలు సామాన్యుల జీవితాలను సంక్షోభంలోకి నెడితే, వాటిని ప్రశ్నించడం పౌరుల బాధ్యత. నేడు సామాన్యుడి జీవితంలో అనేక సమస్యలు తిష్ఠవేశాయి. నిరుద్యోగం యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోంది. ధరల పెరుగుదల మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక వెన్నెముకను విరుస్తోంది. రైతు పంటకు గిట్టుబాటు ధర కోసం పోరాడుతున్నాడు. కార్మికుడు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కోసం ఆరాటపడుతున్నాడు. విద్యార్థి నాణ్యమైన విద్య కోసం ఎదురుచూస్తున్నాడు. పేదవాడు వైద్యం కోసం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. మరోవైపు ప్రభుత్వాల ప్రకటనల్లో మాత్రం అభివృద్ధి ఆకాశాన్ని తాకుతోంది. మరి ఆ అభివృద్ధి ఫలాలు చివరి



ప్రజాస్వామ్యం బతకాలంటే ప్రజల గొంతు బతకాలి. ప్రజల హక్కులు రక్షించబడాలి. ప్రశ్నించే స్వేచ్ఛకు భరోసా ఉండాలి. ఎందుకంటే ప్రజలే ప్రజాస్వామ్యానికి యజమానులు.. పాలకులు కేవలం ప్రజల తరఫున పనిచేసే ప్రతినిధులు మాత్రమే!
శ్రీనివాస్ జీడిపల్లి సామాజిక రచయిత తూప్రాన్.

వరుసలో ఉన్న మనిషికి ఎందుకు అందడం లేదు? గణాంకాల్లో కనిపించే ప్రగతి సామాన్యుడి గడపకు ఎందుకు చేరడం లేదు? ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర కూడా అత్యంత కీలకం. ప్రజల సమస్యలను వెలుగులోకి తేవడం, అధికార దుర్వినియోగాన్ని ప్రశ్నించడం, అవినీతిని బయటపెట్టడం, పాలకుల నిర్ణయాలను విశ్లేషించడం మీడియా బాధ్యత. కానీ మీడియా ఒక వర్గానికి ప్రచార సాధనంగా మారితే, ప్రజా సమస్యల స్థానంలో వ్యక్తి ఆరాధనకు ప్రాధాన్యం పెరిగితే, అధికారాన్ని ప్రశ్నించాల్సిన వేదికలే అధికారానికి భజన చేసే వేదికలుగా మారితే ప్రజాస్వామ్యానికి ప్రమాద ఘంటికలు మోగినట్టే. ప్రశ్నించే జర్నలిజం బలహీనపడితే ప్రజలకు వాస్తవాలు తెలుసుకునే మార్గాలు కూడా కుంచించుకుపోతాయి.

అలాగే ప్రజాస్వామ్యానికి మరో ప్రధాన స్తంభం న్యాయవ్యవస్థ. సామాన్యుడికి న్యాయం అందుబాటులో ఉండాలి. న్యాయం కోసం దశాబ్దాల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి మారాలి. చట్టం ముందు అందరూ సమానులనే రాజ్యాంగ సూత్రం ఆచరణలో కనిపించాలి. ధనవంతుడికి ఒక న్యాయం, పేదవాడికి మరో న్యాయం అనే భావన ప్రజల్లో ఏర్పడితే వ్యవస్థపై విశ్వాసం దెబ్బతింటుంది. పోలీసు వ్యవస్థ ప్రజల రక్షణ కోసం ఉండాలి తప్ప అధికారంలో ఉన్నవారి రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించబడకూడదు. చట్టం పాలకులకు కూడా వర్తించాలి. ప్రజాస్వామ్యంలో ఎవరూ చట్టానికి అతీతులు కారు. ప్రజాస్వామ్యం కేవలం ప్రభుత్వాన్ని ఎన్నుకునే హక్కుతో ముగిసిపోదు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు, సమాచారాన్ని తెలుసుకునే హక్కు, అవినీతిని బయటపెట్టే హక్కు, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు కూడా అంతే ముఖ్యమైనవి. సమాచార హక్కు చట్టం ప్రజలకు పాలనలో పారదర్శకతను కోరే ఆయుధాన్ని అందించింది. కానీ సమాచారాన్ని అడిగే పౌరుడికి భద్రత లేకపోతే, అవినీతిని బయటపెట్టే వ్యక్తి బెదిరింపులకు గురైతే, ప్రజా ప్రయోజనం కోసం గొంతెత్తే సామాజిక కార్యకర్తలు వేధింపులు ఎదుర్కొంటే ప్రజాస్వామ్య రక్షణ ఎక్కడ ఉన్నట్లు? ఎన్నికల్లో మెజారిటీ సాధించడం పాలనకు రాజ్యాంగబద్ధమైన అవకాశం ఇస్తుంది. కానీ ఆ మెజారిటీ ప్రజల హక్కులను హరించే అనుమతి పత్రం కాదు. ప్రజాస్వామ్యం అంటే మెజారిటీ ఆధిపత్యం మాత్రమే కాదు; మైనారిటీల హక్కుల పరిరక్షణ కూడా. భిన్నాభిప్రాయాలను గౌరవించడం, సామాజిక వైవిధ్యాన్ని కాపాడడం, బలహీన వర్గాలకు న్యాయం చేయడం ప్రజాస్వామ్య పరిపక్వతకు నిదర్శనం. ప్రతిపక్షం శత్రువు కాదు. అది ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల తరఫున ప్రశ్నించే మరో గొంతుక. విమర్శను సహించలేని పాలన ప్రజాస్వామ్య పాలనగా ఎలా నిలుస్తుంది?

ప్రజలు కూడా తమ బాధ్యతను గుర్తించాలి. కులం, మతం, ప్రాంతం, వ్యక్తిగత అభిమానం ఆధారంగా ఓటు వేయకుండా అభ్యర్థుల నిబద్ధత, పాలనా సామర్థ్యం, ప్రజా సమస్యలపై వారి వైఖరిని పరిశీలించాలి. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలను ఐదేళ్లపాటు గుర్తుంచుకోవాలి. ప్రజా ప్రతినిధులను నిలదీయాలి. అవినీతిని ప్రశ్నించాలి. ప్రజా ఆస్తుల పరిరక్షణలో భాగస్వాములు కావాలి. ప్రజాస్వామ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే అధికార దుర్వినియోగానికి మనమే పరోక్షంగా అవకాశం కల్పించినవారమవుతాం. చివరగా ఒక విషయం స్పష్టంగా గుర్తుంచుకోవాలి. ప్రజాస్వామ్యానికి అసలైన విజయం ఎన్నికల ఫలితాల్లో కాదు; సామాన్యుడి ముఖంపై కనిపించే భద్రతలో ఉంది. ఒక మహిళ భయం లేకుండా జీవించగలిగినప్పుడు, ఒక రైతు గౌరవంగా బతకగలిగినప్పుడు, ఒక విద్యార్థికి సమాన విద్యావకాశాలు లభించినప్పుడు, ఒక కార్మికుడికి న్యాయమైన వేతనం దక్కినప్పుడు, ఒక పౌరుడు ప్రభుత్వాన్ని నిర్భయంగా ప్రశ్నించగలిగినప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యం పరిఢవిల్లినట్లు. ఓటు వేయడం ప్రజాస్వామ్యంలో పౌరుడి హక్కు అయితే, ప్రశ్నించడం అతని బాధ్యత. పాలించడం ప్రభుత్వ హక్కు కాదు.. ప్రజలకప్పగించిన బాధ్యత. అధికారం శాశ్వతం కాదు, ప్రజలే శాశ్వతం.ఎన్నికల వేళ ప్రజల చుట్టూ తిరిగే నాయకులు, ఎన్నికల తర్వాత ప్రజల ప్రశ్నలకు ఎందుకు దూరమవుతున్నారు? రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాపాడాల్సిన పాలకులే వాటిని పరిమితం చేసే పరిస్థితి వస్తే ప్రజలు ఎవరిని ఆశ్రయించాలి? ప్రజాస్వామ్యం పేరుతో ప్రజల గొంతుక మూగబోతే అది ప్రజాస్వామ్యం కాదు.. అధికార ఆధిపత్యం మాత్రమే!

నేషనల్ హెల్త్ మిషన్‌లో 33 పోస్టుల ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల

- **అభ్యంతరాలు ఉంటే నవంబర్ 25 సాయంత్రం 5 గంటలలోపు తెలియజేయాలి..**
- **జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సీహెచ్. మధుసూదన్..**

భూపాలపల్లి నవంబర్ 21 పీపుల్స్ డైరీ.. భూపాలపల్లి జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నేషనల్ హెల్త్ మిషన్ (చీనవీ) కింద వివిధ క్యాడర్లలో 33 పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సీహెచ్. మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. సదరు ప్రొవిజనల్ మెరిట్ జాబితాను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం, ఎఫ్-25, సమీకృత జిల్లా అధికారుల కార్యాలయాల సముదాయంలోని నోటీస్ బోర్డులో, అలాగే జిల్లా అధికారిక వెబ్‌సైట్ www.bhoopalpally.telangana.gov.in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ మెరిట్ జాబితాను పరిశీలించుకోవాలని, మెరిట్‌కు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈ నెల 23వ తేదీ ఉదయం 10:30 గంటల నుంచి 25వ తేదీ సాయంత్రం 5:00 గంటలలోపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు. నిర్ణీత గడువు ముగిసిన అనంతరం ఎలాంటి అభ్యంతరాలను స్వీకరించబోమని, గడువు తర్వాత వచ్చిన అభ్యంతరాలను ఎంపిక ప్రక్రియలో పరిగణనలోకి తీసుకోబోమని డాక్టర్ మధుసూదన్ స్పష్టం చేశారు..



ఎల్‌నినో పరిస్థితుల్లో తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి

- **రైతులకు ఖేత్ బచావో అభియాన్‌పై అవగాహన**
- **భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేయాలి**

మేడ్చల్: ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని సైదోనిగడ్డ తండాలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు నేల ఆరోగ్య పరిరక్షణ, భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, సుస్థిర వ్యవసాయ పద్ధతులపై ఖేత్ బచావో అభియాన్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు భూసార పరిరక్షణ, భూసార పరీక్షల ప్రాముఖ్యత, భూసార ఆరోగ్య కార్డుల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగం, సేంద్రియ ఎరువుల ప్రాధాన్యత, పంట అవశేషాల నిర్వహణ, సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, నీటి సంరక్షణ,



పంటల వైవిధ్యీకరణ, ప్రకృతి వ్యవసాయం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు నీటి వినియోగాన్ని తగ్గించే పంటలు, స్వల్పకాలిక పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ అధికారులు సూచించారు. ఈ యాసంగిలో వరి సాగుకు బదులుగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల పంటలను సాగు చేసేందుకు మొగ్గు చూపాలని కోరారు. రసాయన ఎరువులు, పురుగుమ మందులను అవసరానికి మించి వినియోగించకుండా, భూసార పరీక్షల ఆధారంగా వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన మోతాదుల్లోనే వాడాలని తెలిపారు. తద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ, పెట్టుబడి ఖర్చులను తగ్గించి, స్థిరమైన వ్యవసాయం సాధించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ శ్రీదేవి, కౌన్సిలర్ రజిత, మండల వ్యవసాయ అధికారి మాధవ్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు తేజస్వినీ, రమేష్, రాజేందర్‌తో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

అత్వెల్లిలో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమం



మేడ్చల్:- పూడూర్--కిష్టాపూర్ డివిజన్ పరిధిలోని అత్వెల్లిలో నక్షత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నక్షత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రొయ్యపల్లి సాయి చరణ్ గౌడ్ ఆహ్వానం మేరకు ఈ పూజా కార్యక్రమంలో పలువురు పాల్గొని అయ్యప్ప స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి పూజలు చేసి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామంలో శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ప్రార్థించారు. అయ్యప్ప స్వామి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి నామస్మరణ చేశారు. నక్షత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలు యువతలో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాకట ప్రేమ్ దాస్, రాఘవ రెడ్డి, ఈశ్వర్ పలువురు నాయకులు స్థానిక యువకులు, అయ్యప్ప భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్



వీణవంక నవంబర్ 21(పీపుల్స్ డైరీ) : మండలంలోని పోతిరెడ్డి పల్లి గ్రామ పంచాయతీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' నమోదు కార్యక్రమాన్ని సర్పంచ్ గజ్జల మొగిలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా కార్యక్రమాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషకరమని, ఈ బీమా ప్రతి పేద కుటుంబానికి ఒక కొండంత భరోసా అని వారు తెలిపారు. ఇంతటి మంచి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన తెలంగాణ ప్రభుత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గ్రామ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మీ రేషన్ కార్డు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో పంచాయతీ సెక్రెటరీ వద్దకు వెళ్లి వెంటనే జీవిత బీమా నమోదు చేసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ లో గర్భిణికి ప్రసవం

108 సిబ్బంది సేవలకు బంధువుల కృతజ్ఞతలు



మేడ్చల్ (పీపుల్స్ డైరీ):- మూడు చింతలపల్లి కొల్తూర్‌కు చెందిన జానకి అనే గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన 108 సిబ్బంది ఆమెను గజ్వేల్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే ప్రసవం జరిగింది.అంబులెన్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఈఎంటీ శ్రీరామ్, పైలట్ తిరుపతి సమయ స్ఫూర్తితో స్పందించి తల్లి, బిడ్డకు అవసరమైన సహాయం అందించారు. అత్యవసర సమయంలో అందించిన సేవలు, చూపిన చొరవ పట్ల జానకి బంధువులు 108 సిబ్బంది శ్రీరామ్, తిరుపతికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఆపద సమయంలో ప్రాణరక్షకులుగా నిలుస్తున్న 108 అంబులెన్స్ సిబ్బంది సేవలను కుటుంబ సభ్యులు అభినందించారు.

ఏసీబీకి చిక్కిన లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి



కరీంనగర్ నవంబర్ 21 పీపుల్స్ డైరీ: కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం లక్ష్మీపూర్ పంచాయతీ కార్యదర్శి లవుడ్యా చమాన్ లాల్ రూ. 10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ కి పట్టుబడ్డాడు. ఫిర్యాదుదారుడి కోడలికి వితంతు పెన్షన్ మంజూరు చేయించేందుకు లంచం డిమాండ్ చేశాడు. ఫిర్యాదుదారుడి ఇంట్లో డబ్బు తీసుకుంటుండగా ఏసీబీ వల వేసి పట్టుకుంది. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర చనున్నారు. లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు తెలిపారు.

పేద విద్యార్థులకు వాటర్ బాటిల్స్ అందజేత



పీపుల్స్ డైరీ, డోర్నకల్, నవంబర్ 21: బిగ్ హెల్ప్ గోల్డెన్ స్టార్ అవార్డ్స్ లో భాగంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వాటర్ బాటిల్స్ ను గిఫ్ట్ గా అందించారు.ఎస్ఏ-1 పరీక్షలో ప్రతి క్లాస్ నుండి అత్యధిక మార్కులు సాధించిన 10 మంది చొప్పున మొత్తం 50 మంది విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్ అందించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూరపాటి శంకర్ మాట్లాడుతూ, పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించే క్రమంలో బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ 15 మంది పేద విద్యార్థులను దత్తత తీసుకొని వారికి కావలసిన బట్టలు, నోట్ పుస్తకాలు, రోజువారీ సామాగ్రి ప్రతి నెల అందిస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బిచ్చ, గోల్డెన్ స్టార్ అవార్డు డైరెక్టర్ షేక్ సాయబ్ అలీ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాం నాయక్, శంకరయ్య, మంజులత, కమల, అనిత, వరలక్ష్మి, వసంతరాణి, దమయంతి, విద్యాసాగర్, రవికుమార్, రాంబాబు, పూర్వ ఉపాధ్యాయులు నర్సింహారావు, అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల నుండి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు

మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు పట్టణంలోని 1, 9వ వార్డులలో వార్డు ఆఫీసర్ గా పనిచేయుచున్న జె.మనేశ్వర్, రెండు పడకల గదుల కేటాయింపులలో లబ్ధిదారుల నుండి డబ్బులు వసూలు చేసినందున అట్టి విషయం రుజువైనందున.సదరు ఉద్యోగిపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధుల నుండి తొలగించడం జరిగిందని, (సస్పెన్షన్) శనివారం ఒక ప్రకటనలు తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో ప్రజలు, లబ్ధిదారుల నుండి డబ్బులు వసూలు చేస్తే సంబంధిత ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు, రెండు పడకల గదులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇతర ప్రభుత్వ పథకాలు ఇప్పిస్తామని మాయమాటలు చెబితే డబ్బులు అడిగితే వెంటనే సమాచారం అందించాలని, ప్రభుత్వ ఉద్యోగులు నిస్వార్థమైన, పారదర్శకమైన, బాధ్యతాయుతంగా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా -డిప్యూటీ కమిషనర్ సుదాన్న్

- గుండ్ల పోచంపల్లి డివిజన్‌లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం



మేడ్చల్:- గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుదాన్న్ ఆధ్వర్యంలో దరఖాస్తుల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. దరఖాస్తుల స్వీకరణకు నెల రోజుల గడువు ఉంటుందని, డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలకు సులభంగా సేవలు అందించేందుకు వార్డు కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గరిసెల సురేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు ఈ పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాన్ని అర్హులందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్, మాజీ సర్పంచులు బండారి నరేందర్ ముదిరాజ్, బేరి ఈశ్వర్, జిల్లా ఓబీసీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవి ముదిరాజ్, మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రమణారెడ్డి, శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బొజ్జ ఆదిలక్ష్మి, మాజీ ఎంపీటీసీ పులిగల్ల రాజేశ్వర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దొడ్ల మోహన్ ముదిరాజ్, అమరం సురేష్ రెడ్డి, జిల్లా ఐఎన్‌టీయూసీ మాజీ అధ్యక్షుడు కావేరి శేఖర్ ముదిరాజ్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు పాలకుర్తి మురళి గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుండ భానుచందర్, జిల్లా ఓబీసీ నాయకుడు సాయిపేట సురేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్ ముదిరాజ్, తలారి వెంకటేష్ ముదిరాజ్, కండ్లకొయ్య మాజీ ఉపసర్పంచ్ చిల్ల వెంకటేష్ ముదిరాజ్, సేవాదళ్ అధ్యక్షుడు చిల్ల సాయి ముదిరాజ్, ప్రవీణ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలు జరిగేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లి నవంబర్ 21 పీపుల్స్ డైరీ.. తల్లికి ఆరోగ్య పరిరక్షణకు సాధారణ ప్రసవాలు జరిగేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, పురోగతిపై సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యపరంగా అత్యవసరమైన సందర్భాల్లో మాత్రమే సిజేరియన్ ప్రసవాలు నిర్వహించాలని, అనవసర సిజేరియన్లను నియంత్రించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ, సాధారణ ప్రసవాలకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని తెలిపారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ ఆరోగ్య సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా వైద్యాధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గర్భిణులు, చిన్నపిల్లలు, కౌమార బాలబాలికలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలు అందించాలని సూచించారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన తాజా గణాంకాలు, నెలవారీ పురోగతి, పనితీరు సూచికలతో కూడిన నివేదికలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. నివేదికల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా వాస్తవ గణాంకాలను నిర్దిష్ట సమయంలో సమర్పించాలని అధికారులకు స్పష్టం చేశారు. అంతకు ముందు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ జిల్లాలో అమలవుతున్న మాతా శిశు ఆరోగ్య కార్యక్రమాలు, హైరిస్క్ గర్భిణుల గుర్తింపు, సంపూర్ణ టీకాల కార్యక్రమం, కుటుంబ నియంత్రణ సేవలు, క్షయ, కుష్టు వ్యాధుల నివారణ, మధుమేహం, రక్తపోటు వంటి అసంక్రమిత వ్యాధుల పరీక్షలు, రక్తహీనత నివారణ, పోషకాహార కార్యక్రమాల పురోగతిని కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా వెంకటరత్నం, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, గైనకాలజిస్టులు, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గురువుపై గౌరవం..20 ఏళ్లైనా చెరగని అనుబంధం

- గురువు కుమార్తె వివాహానికి ఆర్థిక సాయం
- ఆదర్శంగా నిలిచిన కాకతీయ హైస్కూల్ 2004--05 SSC బ్యాచ్



జమ్మికుంట, నవంబర్ 21 పీపుల్స్ డైరీ : గురువు నేర్పిన విద్యాబుద్ధులు, చూపిన మార్గం విద్యార్థుల జీవితాల్లో ఎంతటి ప్రభావం చూపుతాయో కాకతీయ హైస్కూల్ 2004--05 బ్యాచ్ విద్యార్థులు చాటిచెప్పారు. దాదాపు 20 ఏళ్లు గడిచినా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుపై అభిమానం, ఆయన కుటుంబంపై ఆప్యాయతను మరువకుండా, గురువు కుమార్తె వివాహానికి ఆర్థిక సహాయం అందించి మానవత్వానికి మచ్చుతునకగా నిలిచారు. జమ్మికుంట కాకతీయ హైస్కూల్‌లో చదువు కున్న పూర్వ విద్యార్థులు తమ గురువు కీర్తిశేషులు బుర్ర సంజీవ్ ప్రథమ కుమార్తె మధుహాసిని--సాయికృష్ణ వివాహాన్ని పురస్కరించుకుని రూ.90 వేల ఆర్థిక సహాయాన్ని సేకరించి వివాహ వేడుకలో అందజేశారు. ఇందులో రూ.60 వేల నగదును చెక్కు రూపంలో, రూ.15 వేలతో బీరువా, కూలర్‌ను 2005--06 బ్యాచ్ విద్యార్థుల తరఫున అందించారు. మరో రూ.15 వేలతో చిన్నారి కళాశాల ఫీజు చెల్లించి కుటుంబానికి అండగా నిలిచారు. గతంలో 2012లో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలోనూ గురువు సంజీవ్ కుటుంబానికి రూ.35 వేల ఆర్థిక సహాయం అందించడం విశేషం. గురువు భౌతికంగా దూరమైనప్పటికీ ఆయన నేర్పిన విలువలు, జ్ఞాపకాలు విద్యార్థుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాయని ఈ సహాయం మరోసారి నిరూపించింది. వివాహ వేడుకకు హాజరైన బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు గురువు పట్ల విద్యార్థులు చూపిన ప్రేమాభిమానాలు, బాధ్యత, సేవాభావాన్ని అభినందించారు. చదువు చెప్పిన గురువు కుటుంబాన్ని తమ కుటుంబంగా భావించి కష్టసుఖాల్లో తోడుగా నిలవడం నేటి విద్యార్థులకు గొప్ప సందేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబీరి శ్రీకాంత్, జక్కు రజనీకాంత్, పైండ్ల రాజేష్ రెడ్డి, పిల్లల శ్రీనివాస్, నాగలగని మధు, వొల్లల అజయ్, పలకల చంద్ర రెడ్డి, కండెం రాజేష్, పొద్దుటూరి విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. గురువుపై గౌరవం, తోటి మనిషిపై బాధ్యత, ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉంటే సమాజంలో ఎన్నో మంచి మార్పులు సాధ్యమవుతాయని ఈ పూర్వ విద్యార్థులు తమ ఆచరణతో చాటిచెప్పారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా-తహసిల్దార్ గుర్రం శ్రీనివాస్ గౌడ్

- ఇందిరమ్మ కుటుంబ బీమా భరోసా"
- దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించిన తహసిల్దార్ గుర్రం శ్రీనివాస్ గౌడ్



సైదాపూర్ నవంబర్ 21 (పీపుల్స్ డైరీ): రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సైదాపూర్ తహసిల్దార్ గుర్రం శ్రీనివాస్ గౌడ్ కోరారు. శనివారం రోజున స్థానిక వెంకేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ఈ పథకం దరఖాస్తు నమోదు ప్రక్రియను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొంత సుధాకర్ కు కలిసి స్థానిక సర్పంచ్ సునీత రవీందర్ ఎంపీడీవో యాదగిరి ఎంపీ ఓ బసీరుద్దీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కుటుంబానికి జీవనాధారంగా ఉన్న వ్యక్తి అనుకోని పరిస్థితుల్లో మరణిస్తే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా రూ.5 లక్షల జీవిత బీమా అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కుటుంబ పెద్దకు బీమా భద్రత కల్పించడం ద్వారా కుటుంబ సభ్యులకు ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు.

ఏఎంసీ చైర్మన్ , దొంత సుధాకర్ మాట్లాడుతూ

ఈ పథకానికి 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులని, కుటుంబంలో సంపాదించే ఒక వ్యక్తికి మాత్రమే బీమా వర్తిస్తుందని వివరించారు. బీమా పొందే వ్యక్తి మ-రణించిన సందర్భంలో ముందుగా నమోదు చేసిన నామినీకి రూ.5 లక్షల బీమా మొత్తం అందుతుందని తెలిపారు. బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని, లబ్ధిదారులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. నవంబర్ 19 నుంచి ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ డిసెంబర్ 18 వరకు కొనసాగుతుందని తెలిపారు. అర్హులైన వారు బీమా పొందే వ్యక్తి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, నామినీ ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్‌తో పాటు అవసరమైన వివరాలను తీసుకొని వంగర గ్రామపంచాయతీ కార్యాల యంలో దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని ప్రతి అర్హులైన కుటుంబానికి ఈ పథకంపై అవగాహన కల్పించి, అందరికీ ప్రయోజనం చేకూరేలా గ్రామపంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు పంతంగి రవీందర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాడా కొండల్ రెడ్డి గుండారం శ్రీనివాస్ మేకల రాజు పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరరావు ఉపసర్పంచ్ గ్రామ వార్డు సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్టులో హుస్నాబాద్ క్రీడాకారులు

ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల సత్కారం



హుస్నాబాద్, టౌన్: (పీపుల్స్ డైరీ) నవంబర్ 21 : ఉమ్మడి మెదక్ జిల్లా కబడ్డీ జట్టుకు హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించడం అభినందనీయమని ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.క్రీడాకారులను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు ప్రోత్సాహం అందించడం ద్వారా వారు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశం కలుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ విజయేందర్ రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అరవింద్, కార్యదర్శి రాజారెడ్డి, కోశాధికారి సంపత్, సంయుక్త కార్యదర్శి లక్ష్మణ్, ఈసీ సభ్యులు అజయ్, ప్రవంతి, కవిత, మాధవి, లావణ్య, కళావతి పాల్గొన్నారు.

నూతన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం



పీపుల్స్ డైరీ, డోర్నకల్, నవంబర్ 21: కాంగ్రెస్ పేదలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేస్తుందని ఇందుతో భాగంగా రాష్ట్రంలో మంజూరైన అనేక గృహాల నిర్మించి ఇస్తుందని డోర్నకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మండలం పెరుమండ్ల సంకిస గ్రామంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ ఆదేశం మేరకు పూజల సాయి – శైలజ నూతన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం నిర్వహించారు. కార్యక్రమానికి , జిల్లా కార్యదర్శి కసం శేఖర్, గ్రామ సర్పంచ్ జీడి మధు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పటాన్ అష్టల్, మండల నాయకులు ఆంగోత్ వెంకన్న, గండు బాబు, జోగ్యతండ సర్పంచ్ చందవత్ రమేష్, గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరై గృహప్రవేశ వేడుకలు పాల్గొన్నారు.

రాంనగర్ లో రాజ్యాంగ పరిరక్షణ కమిటీ

అధ్యక్షుడిగా కనకం రమేష్, ప్రధాన కార్యదర్శిగా భూక్య సంపత్



భీమదేవరపల్లి నవంబర్ 21(పీపుల్స్ డైరీ): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రాంనగర్ గ్రామంలో భారత రాజ్యాంగ పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసినట్లు మండల అధ్యక్షుడు ఉప్పుల కుమార్ స్వామి తెలిపారు.. రాంనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని మంగళపల్లి లో ఏర్పాటు చేసిన సమావేశం లో గ్రామ శాఖ అధ్యక్షుడిగా కనకం రమేష్, ప్రధాన కార్యదర్శిగా భూక్య సంపత్, ఉపాధ్యక్షులుగా కనకం నరేష్, భూక్య చంద్రు, పార్నంది ఆంజనేయులు, సహాయ కార్యదర్శి గా డప్పు రాహుల్, భూక్య తిరుపతి, పార్నందుల అన్వేష్, సయ్యద్ అబ్బాస్, కోఆర్డినేటర్ గా మిట్టపల్లి రమేష్, కార్యవర్గ సభ్యులు భూక్య హరియ, కనకం శ్రీధర్, డప్పు ప్రవీణ్, వేమునూరి శ్రీధర్, ఆంజనేయులు, సలహాదారులుగా డప్పు శ్రీనివాస్, సయ్యద్ బాషా, మడక ఐలయ్య, రమేష్ ఎన్నికైనట్లు తెలిపారు.. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డ్యాగల సారయ్య, రేణికుంట్ల బిక్షపతి, రాంనగర్ సర్పంచ్ డప్పు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు..

కొత్త పింఛన్లపై సీఎం రేవంత్‌కు కౌశిక్ రెడ్డి రాజీనామా సవాల్

నియోజకవర్గంలో 1,029 పింఛన్లను రద్దు చేశారని ఆరోపణ



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. హుజురాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క కొత్త పింఛను కూడా మంజూరు చేయలేదని, పైగా అర్హులైన పేదల పింఛన్లను తొలగించిందని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలో పింఛన్ల అంశంపై సీఎంకు ఆయన నేరుగా రాజీనామా సవాల్ విసిరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ... “ఒక్క కొత్త పింఛను ఇచ్చినా నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. లేకుంటే సీఎం పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తారా” అంటూ ఆయన సవాల్ చేశారు. తన నియోజకవర్గంలో లబ్ధిదారుల సంఖ్య పెరిగినట్లు అధికార పక్షం నిరూపిస్తే తాను క్షమాపణ చెప్పి పదవి నుంచి తప్పుకుంటానని, అలా నిరూపించలేకపోతే సీఎం తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ప్రస్తుత ప్రభుత్వం హుజురాబాద్‌లో దాదాపు 1,029 చేయూత పింఛన్లను రద్దు చేసిందని కౌశిక్ రెడ్డి ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ సంక్షేమ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. గతంలో వృద్ధులకు ఉన్న రూ. 200 పింఛన్‌ను కేసీఆర్ రూ. 2 వేలకు, దివ్యాంగుల పింఛన్‌ను రూ. 4 వేలకు పెంచి పేదలకు అండగా నిలిచారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గతంలో ప్రతి నెలా 45 లక్షల మందికి పింఛన్లు అందేవని పేర్కొన్నారు.

ముల్కనూర్ మోడల్ స్కూల్‌లో ఎంఎస్ఎఫ్ కమిటీ ఏర్పాటు



భీమదేవరపల్లి నవంబర్ 21 (పీపుల్స్ డైరీ): గౌరవ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ మోడల్ స్కూల్‌లో శనివారం ఎంఎస్ఎఫ్ (మీఖీ) కమిటీని ఏర్పాటు చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జి మాట్ల వెంకటస్వామి మాదిగ, మండల అధ్యక్షులు వేల్పుల ప్రశాంత్ ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షురాలిగా మేకల ప్రశ్రిత, ఉపాధ్యక్షురాలిగా పులి ఐషు, అధికార ప్రతినిధిగా పులి మేఘన, ప్రధాన కార్యదర్శిగా మాడ్గుల సాత్విక్‌ను నియమించారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా తూముల హాని, కురుసపల్లి నికిత, వొస్కుల బ్లెసినా, కొంకట సిరి, మాడ్గుల రితిక, కొట్టె గౌతమి, కొట్టె సహస్ర, కురుసపల్లి ప్రవళిక, చి. సుమప్రియ, గొర్రె హాని, మట్టెవాడ సిరి, చిర్ర రోన్ హన్నలను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, సామాజిక చైతన్యానికి, విద్యార్థుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు.

పీపుల్స్‌డైరీ
వరంగల్
ఆదివారం, 22 నవంబర్ 2026
సంపుటి : 18, సంచిక : 241

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు.. పట్టించుకోని అధికారులు

- కాలకల్ గ్రామంలో అనుమతులు లేకుండా సెల్లార్‌తో కూడిన మూడు అంతస్తుల భవనం నిర్మాణం
- పేదల ఇళ్ల నిర్మాణాలపై ఆంక్షలు.. బడాబాబుల నిర్మాణాలపై అధికారుల మౌనం అంటూ గ్రామస్తుల ఆవేదన



పీపుల్స్ డైరీ నవంబర్ 21: మనోహరాబాద్: మండలంలోని కాలకల్ గ్రామంలో అనుమతులు లేకుండా సెల్లార్‌తో కూడిన మూడు అంతస్తుల భవన నిర్మాణం యథేచ్ఛగా కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూపాయి రూపాయి కూడబెట్టుకొని సామాన్యులు ఇళ్లు నిర్మించుకుంటుంటే, అనుమతుల పేరుతో వారిని ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులు, భారీ నిర్మాణాలు చేపడుతున్న బడాబాబుల విషయంలో మాత్రం ఎందుకు మౌనం వహిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. నిబంధనలు సామాన్యులకేనా? పెద్ద నిర్మాణదారులకు వర్తించవా? అంటూ నిలదీస్తున్నారు.గ్రామంలో సెల్లార్‌తో పాటు మూడు అంతస్తుల నిర్మాణం చేపడుతున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోక పోవడం అనుమానాలకు తావిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించకపోతే నిబంధనలు అమలు చేస్తున్నట్లుగా ఎలా భావించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలకల్ గ్రామంలో జరుగుతున్న నిర్మాణంపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని, నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయో లేదో పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసి, చట్టం అందరికీ సమానంగా వర్తించేలా అధికారులు వ్యవహరించాలని కోరుతున్నారు.

గౌరవెల్లి నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం

- ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా..
- పూరెళ్ళ శ్రావణ్ కుమార్ గౌడ్

హుస్నాబాద్, టౌన్: (పీపుల్స్ డైరీ) నవంబర్ 21 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో టిఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి పూరెళ్ళ శ్రావణ్ కుమార్ గౌడ్ శనివారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడతానని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు భూనిర్వాసితులకు పెండింగ్ పరిహారాలు అందించాలని, భూములు కోల్పోయిన వారితో పాటు బావులు, చెట్లు, ఇతర నిర్మాణాలు కోల్పోయిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి వారం రెండు రోజులు పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల కవిత ప్రకటించిన పాంచజన్య పథకంలోని ఉచిత విద్య, వైద్య విధానాలు మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని పేర్కొన్నారు. మహిళలు, యువత, వివిధ వృత్తుల వారికి పార్టీలో సముచిత ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్టీ కార్యకలాపాలను విస్తరిస్తామని చెప్పారు.



ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి లింగంపల్లి నాగరాజు, జిల్లా అధ్యక్షుడు లోకి రవిచంద్ర, స్టేషన్ ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిలుక ప్రవీణ్ హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడిలో శ్రీ వీరబ్రహ్మంగారి జయంతోత్సవం

ప్రత్యేక పూజలు జరిపిన రాజ్ కుమార్

చిగురుమామిడి,నవంబర్21(పీపుల్స్ డైరీ) : కాలజ్ఞానకర్త తత్వవేత్త జగద్గురు శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 418 వ జయంతి కార్యక్రమం చిగురుమామిడి మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద విశ్వబ్రాహ్మణ మండల కమిటీ అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్వామివారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి పాటలతో భజనలతో స్వామిని కీర్తించి పుష్పాంజలి ఘటించి టెంకాయ కొట్టి ప్రసాద నివేదన చేశారు రాజ్ కుమార్ మాట్లాడుతూ 16వ శతాబ్దంలో కీలక నామ సంవత్సర కార్తీక మాస శుద్ధ ద్వాదశి నాడు సరస్వతి నది తీరాన ప్రకృతాంబ పరిపూర్ణయ దంపతులకు వీర బ్రహ్మంగారు జన్మించారు తల్లిదండ్రులు శివైక్యం చెందిన తర్వాత ఆత్రేయ మహాముని పెంచి విద్యాబుద్ధులు నేర్పించాడు తదుపరి వీరపాపమంబ వీరభోజయచార్యులు దత్తపుత్రునిగా స్వీకరించి అలన పాలన చేశారు చిన్ననాడే తల్లికి విశ్వరూపం చూపించి పిండోత్పత్తి క్రమాన్ని తెలిపారు అచ్చమాంబ వద్ద గోపాలనం చేశారు బ్రహ్మానంద రెడ్డికి కన్నులు ఇచ్చాడు కడప నవాబుకు కాలజ్ఞానాన్ని చెప్పాడు పోలేరమ్మతో నిప్పును తెప్పించాడు గోవింద మాంబను వివాహం చేసుకొని ఐదుగురి పుత్రులను ఒక పుత్రికను కన్నాడు కుల మతాలకు అతీతంగా హరిజన కక్కయ్యను దూదేకుల సిద్ధయ్యను శిష్యులుగా చేర్చుకున్నాడు ఆనాడే సంపత్తి భోజనాలు పెట్టించాడు జరుగుతున్నది భవిష్యత్తులో జరగబోయేది తన సాంద్ర సింధు వేదమైన కాలజ్ఞానం ద్వారా అందరికీ తెలియజేశాడు ఇంతటి మహిమాన్వితుడైన వీర బ్రహ్మంగారు చెప్పినట్టే ఈ కలియుగం నడుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అనుమోజు బాల కృష్ణమాచారి, కూరెల్ల వెంకటయ్య, రంగు రాజేందర్, విశ్వనాథం సత్తయ్య, వడ్లూరి రాజయ్య, శ్రీరామోజు రాములు, పోలోజు లక్ష్మీనారా యణ, పోలోజు కుమారస్వామి, అనుమోజు చిరంజీవి,వడ్లూరి నరేష్,అనుమోజు శ్రీనివాస్, కొత్తపెల్లి శ్రీకాంత్,కొత్తపెల్లి వినోద్, శ్రీరామోజు తిరుపతి కళాకారులు కుతాడి కొమురయ్య, మొగిలి బొందయ్య, నిలిగొండ కిషన్, నిలిగొండ సదానం దం,గౌడ బిక్షపతి,మోర వెంకటమల్లు, చందబోయిన పరశురాములు, మల్లం సూరి,పెనుకుల అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి ఒలింపియాడ్ పోటీలకు నలుగురు విద్యార్థుల ఎంపిక

- మండల స్థాయి ఇంగ్లీష్ ఒలింపియాడ్, టెడ్ టాక్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

భీమదేవరపల్లి (పీపుల్స్ డైరీ) : ఎల్టా (ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ జెడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఇంగ్లీష్ ఒలింపియాడ్, టెడ్ టాక్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆంగ్ల విభాగం ప్రొఫెసర్ మేఘన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించడంతో పాటు ఆత్మవిశ్వాసంతో ఆంగ్లంలో మాట్లాడే నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు, సృజనాత్మకత, భావ వ్యక్తీకరణ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఎంతగానో దోహద పడతాయని తెలిపారు. మండల స్థాయి పోటీల నిర్వహణ బాధ్యతలను ఎల్టా మండల టెస్ట్ ఇన్‌చార్జిలు రామంచ బిక్షపతి, కొత్తపల్లి శ్రీనివాస్ నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన టీజీ ఎంఎస్ ముల్కనూర్‌కు చెందిన ఎన్. ప్రజ్వల్, జెడ్పీహెచ్ఎస్ గట్టనర్సింగాపూర్‌కు చెందిన యు. రిషిత, జి. భాగ్యలక్ష్మి, ఎన్. నాగేశ్వరి జిల్లా స్థాయి ఒలింపియాడ్ పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ముఖ్య అతిథి ప్రొఫెసర్ మేఘన, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి రవీందర్ అభినందించారు. జిల్లా స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దాసరి రవీందర్, ఆంగ్ల ఉపాధ్యాయులు శ్రీదేవి, సుకన్య, కొత్తపల్లి శ్రీనివాస్, ఎల్టా మండల టెస్ట్ ఇన్‌చార్జి రామంచ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో నూతన సీసీ రోడ్లకు శంకుస్థాపన



మేడ్చల్:- ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని డబిల్‌పూర్ వార్డులో సీసీ రోడ్డు డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ సార ముత్యాలు గౌడ్ ప్రత్యేక చొరవతో చేపట్టిన ఈ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్లంపేట మున్సిపల్ ప్రెసిడెంట్, కౌన్సిలర్ ఎర్రవల్లి విగ్నేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సంజీవరావు మాట్లాడుతూ, వార్డు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రజలు ఎదుర్కొం టున్న రహదారి సమస్యలు, డ్రైనేజీ ఇబ్బందులను పరిష్కరించేందుకు ఈ పనులు ఎంతగానో దోహ దపడతాయని తెలిపారు. నూతన రహదారుల నిర్మాణంతో రాకపోకలు సులభతరం కావడంతో పాటు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడటం ద్వారా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత లభిస్తుందని పేర్కొన్నారు. వార్డు అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా స్థానిక ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కౌన్సిలర్ ప్రత్యేక చొరవ తీసుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు పూర్తయితే వార్డు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ కుటుంబ సభ్యులు, కాలనీ నివాసులు తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో గట్లనర్సింగాపూర్ పాఠశాలకు ప్రథమ స్థానం

జిల్లా స్థాయి పోటీలకు రెండు జట్ల ఎంపిక



భీమదేవరపల్లి, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ముల్కనూర్ జెడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో గట్లనర్సింగాపూర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని సాధించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, జనవిజ్ఞాన వేదిక హనుమకొండ గౌరవ అధ్యక్షురాలు ప్రొఫెసర్ సుంకరి జ్యోతి హాజరయ్యారు. గౌరవ అతిథిగా అదే కళాశాల ఆంగ్ల విభాగం ప్రొఫెసర్ మేఘన పాల్గొన్నారు. కార్యక్రమానికి ముల్కనూర్ జెడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి రవీందర్ అధ్యక్షత వహించారు. ఈ పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలల నుంచి పాఠశాల స్థాయిలో విజేతలుగా నిలిచిన 33 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయి పోటీల్లో జెడ్పీహెచ్ఎస్ గట్లనర్సింగాపూర్ పాఠశాలకు చెందిన బి. సింహ, వి. అనుదీప్, జి. భాగ్యలక్ష్మి ప్రథమ స్థానాన్ని సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.అదేవిధంగా రెసిడెన్షియల్ పాఠశాలల విభాగంలో జె. కార్తీక్, వి. కిరణ్ కుమార్, జి. శ్రీవల్లి ప్రథమ స్థానాన్ని సాధించి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు.ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా కార్యదర్శి, చెకుముకి మండల ఇన్‌చార్జి రామంచ బిక్షపతి మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రథమ స్థానాలు సాధించిన రెండు జట్లు ఈ నెల 28న నిర్వహించనున్న జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించే తత్వం, పరిశీలనా శక్తి, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడమే చెకుముకి పోటీల ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ఆంగ్ల వక్తృత్వ పోటీల్లో భూక్య మహతికి ద్వితీయ బహుమతి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక.. ఉసిరికాయలపల్లిలో హర్షాతిరేకం



సింగరేణి (కారేపల్లి), నవంబర్ 21 (పీపుల్స్ డైరీ):ఆంగ్ల వక్తృత్వ పోటీల్లో సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని భూక్య మహతి అద్భుత ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతి సాధించింది. అంతేకాకుండా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై గ్రామానికి, పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది.టేకులపల్లి ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న భూక్య మహతి, దుమ్ముగూడెం ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఆంగ్ల వక్తృత్వ పోటీల్లో పాల్గొంది. రాష్ట్రవ్యాప్తంగా మూడు సమూహాలుగా విభజించి నిర్వహించిన ఈ పోటీల్లో రెండో సమూహం స్థాయిలో తన వక్తృత్వ నైపుణ్యాన్ని ప్రదర్శించి ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుంది. ఈ విజయంతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది.చిన్న వయస్సులోనే ఆంగ్ల భాషలో అనర్గళంగా మాట్లాడి పోటీల్లో విజయం సాధించడం పట్ల భూక్య మహతి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, ఉసిరికాయలపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.విద్యార్థినిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిషాన్ కిష్టాన్‌వ్‌కు, విద్యార్థుల బృందానికి నాయకత్వం వహించిన ఉపాధ్యాయురాలు పారుల్ కథారియాకు మహతి తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్రస్థాయి పోటీల్లోనూ భూక్య మహతి ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు.. రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్

ఎమ్మెల్యేల వ్యాఖ్యలను ఏఐసీసీ నిశితంగా పరిశీలిస్తోందని వెల్లడి



కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి ఇటీవల సొంత పార్టీపై చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. పార్టీ లైన్ దాటి మాట్లాడే నేతలపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే అంశాన్ని అధిష్ఠానం చూసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, పార్టీ అంతర్గత వ్యవహారాలపై ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. “కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం కొంచెం ఎక్కువైంది. పార్టీ లైన్ దాటి మాట్లాడే వారిపై క్రమశిక్షణ చర్యల గురించి ఏఐసీసీ చూసుకుంటుంది. ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలను ఏఐసీసీ నిశితంగా పరిశీలిస్తోంది” అని తెలిపారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బీజేపీ బలంగా ఉందంటూ చేసిన వ్యాఖ్యలు, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రభుత్వ స్థిరత్వం, పనితీరుపై మాట్లాడిన అంశాలు పార్టీలో తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో పీసీసీ చీఫ్ ఈ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా క్రమశిక్షణ ప్రాధాన్యతను వివరిస్తూ ఆయన గత ఉదంతాన్ని గుర్తుచేశారు. “గతంలో కొండా సురేఖ విషయంలోనూ మొదటిసారే చర్యలు తీసుకోలేదు. పలుమార్లు హెచ్చరించాం. తీరు మారకపోవడంతోనే చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. క్రమశిక్షణ ముందు అందరూ సమానమే. దేనికైనా సరైన సమయం ఉంటుంది” అని స్పష్టం చేశారు. పార్టీలో ప్రతి ఒక్కరూ నిబంధనలకు కట్టుబడి ఉండాలని, ఎవరైనా పరిధి దాటి ప్రవర్తిస్తే అధిష్ఠానం తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

పీపుల్స్‌డైరీ
వరంగల్
ఆదివారం, 22 నవంబర్ 2026
సంపుటి : 18, సంచిక : 241

జనగామలో విషాదం: భర్త మరణించిన కొన్ని గంటల్లోనే భార్య కన్నుమూత

గంటల వ్యవధిలోనే తనువు చాలించిన వృద్ధ దంపతులు

తెలంగాణలోని జనగామ జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. జీవితాంతం ఒకరికొకరు తోడుగా సాగిన వృద్ధ దంపతులు, మరణంలోనూ ఒకరినొకరు వీడలేక గంటల వ్యవధిలోనే కన్నుమూశారు. ఈ హృదయ విదారక ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది.జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం పరిధిలోని చాగల్లు గ్రామానికి చెందిన వృద్ధ దంపతులలో భర్త 84 ఏళ్ల లోకేనాథం శుక్రవారం రాత్రి సుమారు 9:50 గంటల సమయంలో మరణించాడు. ఇప్పటివరకు ఉన్న భర్త ఇక లేడన్న వార్తను ఆయన భార్య రామక్క (75) జీర్ణించుకోలేకపోయింది. భర్త మరణంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె, ఆ వియోగాన్ని తట్టుకోలేక శనివారం ఉదయం తుదిశ్వాస విడిచింది.కొద్ది గంటల వ్యవధిలోనే భార్యాభర్తలిద్దరూ ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబంలో తీరని శోకం అలుముకుంది. జీవిత చరమాంకంలోనూ ఒకరిని విడిచి మరొకరు ఉండలేక ఒకేసారి తనువు చాలించడం చాగల్లు గ్రామ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఒకే రోజు దంపతులిద్దరూ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

భవిష్యత్‌లో ప్రమాదం రాబోతోంది..

తుపాకులు కొనుక్కోండి: రాజాసింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు



భవిష్యత్తులో దేశంలో హిందువుల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే భద్రతా ముప్పులను ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ రక్షణ పద్ధతులను నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. చట్టప్రకారం అనుమతులు పొంది ప్రతి హిందువు తప్పనిసరిగా లైసెన్స్‌డ్ తుపాకీని దగ్గర ఉంచుకోవాలని అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడిన వీడియో దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ముస్లింల జనాభా నానాటికీ పెరిగిపోతోందని రాజాసింగ్ తన వీడియోలో ప్రస్తావించారు. దీనివల్ల కాలక్రమేణా భారతదేశంలో హిందువుల ఉనికికి, భద్రతకు పెను సవాలు ఎదురవుతుందని వ్యాఖ్యానించారు. అలాంటి అనిశ్చిత పరిస్థితులు ఉత్పన్నమైనప్పుడు సమాజం ఎలా తట్టుకుంటుందని ప్రశ్నించారు. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఇప్పటి నుంచే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తినా ధీటుగా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలన్నారు.ఆత్మరక్షణ కోసమే తుపాకులు కొనుగోలు చేయాలని చెప్పిన ఆయన, దానికి సంబంధించి చట్టబద్ధమైన నిబంధనలను పాటించాలని గుర్తుచేశారు. ఈ వీడియో నెట్టింట బయటకు రావడంతో తీవ్ర దుమారం చెలరేగింది. ఒక ప్రజాప్రతినిధి బహిరంగంగా ఇలాంటి పిలుపునివ్వడంపై రాజకీయ పక్షాలు, సామాజిక వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఈ వ్యవహారం రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

హైదరాబాద్ 'మెటా' కార్యాలయంలో కాంగ్రెస్ కార్యకర్తల విధ్వంసం

కార్యాలయ కారిడార్లలోని పూలకుండీలను ధ్వంసం చేసిన నిరసనకారులు

తమ జాతీయ నాయకుల సోషల్ మీడియా ఖాతాలపై ఆంక్షలు విధించడాన్ని నిరసిస్తూ తెలంగాణ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు నిన్న హైదరాబాద్ రాయదుర్గంలోని మెటా కార్యాలయం ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి నేతృత్వంలో దాదాపు 25 మంది కార్యకర్తలు స్కైవ్యూ భవనంలోకి ప్రవేశించి కేంద్ర ప్రభుత్వం, మెటా సంస్థకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో కారిడార్‌లోని పూలకుండీలను కొందరు కార్యకర్తలు ధ్వంసం చేశారు.భారత యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్, జాతీయ ఇన్‌ఛార్జ్ మనీష్ శర్మల ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను నిలిపివేయడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని యూత్ కాంగ్రెస్ ఆరోపించింది. ఖాతాలపై ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని, లేకుంటే ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని ఏడు రోజుల అల్టిమేటం జారీ చేసింది. ఇదే అంశంపై ముంబైలోని మెటా కార్యాలయం వెలుపల కూడా ఆ పార్టీ శ్రేణులు నిరసన చేపట్టాయి.ఈ ఘటనపై సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు సుమారు 21 మంది నిరసనకారులను ముందస్తు జాగ్రత్తగా అదుపులోకి తీసుకుని, అనంతరం బెయిల్‌పై విడుదల చేశారు. నిరసనకారులు ప్రధాన కార్యాలయంలోకి ప్రవేశించలేదని, సంస్థ నుంచి ఎటువంటి అధికారిక ఫిర్యాదు రాకపోవడంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు. యూత్ కాంగ్రెస్ తీరుపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు తీవ్ర స్థాయిలో స్పందించారు. కాంగ్రెస్ కార్యకర్తలు ప్రైవేట్ సంస్థల కార్యాలయాలపై దాడులు చేస్తూ గూండాయిజానికి పాల్పడుతున్నారని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శించారు.మరోవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ... ఎన్నో ఏళ్లుగా కష్టపడి నిర్మించిన 'బ్రాండ్ హైదరాబాద్' నమ్మకాన్ని ఇలాంటి చర్యలు దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆర్బీఐ నివేదికను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు

కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధి ఆగిపోయిందన్న కేటీఆర్



కేసీఆర్ హయాంలో అభివృద్ధి బాటలో సాగిన తెలంగాణ గ్రామాలు, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో నిధుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల ఖర్చులు భారీగా తగ్గిపోయాయని పేర్కొంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) విడుదల చేసిన 'ఫైనాన్సెస్ ఆఫ్ పంచాయతీరాజ్ ఇన్‌స్టిట్యూషన్స్' నివేదికను ప్రస్తావిస్తూ కేటీఆర్ ఈ వివరాలను వెల్లడించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలోని గ్రామ పంచాయతీలు సగటున ఒక్కొక్కటి రూ. 16.59 లక్షలు ఖర్చు చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో 2024-25 నాటికి ఆ మొత్తం రూ. 6.24 లక్షలకు పడిపోయిందని ఆయన తెలిపారు.ప్రజలు కట్టిన పన్నులు, ప్రభుత్వం తెస్తున్న అప్పులు అభివృద్ధి పనులకు చేరడం లేదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలనలో పల్లె నుంచి పట్నం వరకు ఎక్కడా అభివృద్ధి కనిపించడం లేదని, జరుగుతున్నదంతా విధ్వంసమేనని కేటీఆర్ పేర్కొన్నారు.

ఘనంగా దివంగత రెవరెండ్ బెల్లం సుధాకర్ ప్రథమ వర్ధంతి

- **ఆయన సేవలు, ఆధ్యాత్మిక జీవన ప్రయాణంపై 'ఒక కాపరి జీవిత ప్రయాణం' పుస్తకా విష్కరణ**



శామీర్‌పేట్: డివిజన్ పరిధిలోని దేవరయాంజాల్ గ్రామంలో ప్రైజ్ ది లార్డ్ ఫెలోషిప్ చర్చిలో దివంగత పాస్టర్ రెవరెండ్ బెల్లం సుధాకర్ ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు, క్రైస్తవ సోదరుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి, పాస్టర్ బి. శామ్యూల్, పాస్టర్ జాన్ బాబు, కుటుంబ సభ్యులు తదితరుల సమక్షంలో పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఒక వ్యక్తి జీవితంలో నమ్మిన విలువలు, సేవాభావం, ఆధ్యాత్మిక ప్రయాణం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని, బెల్లం సుధాకర్ జీవిత విశేషాలను పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమని అన్నారు.కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ తండ్రి బెల్లం సుధాకర్ ప్రేమ, ఆప్యాయత, సేవాభావం, మానవత్వం కలిగిన గొప్ప వ్యక్తి అని గుర్తు చేసుకున్నారు. ఆయన అందించిన ప్రేమ, చూపించిన మార్గదర్శకత్వం, నేర్పిన మంచి విలువలు తమ జీవితాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు. ఆయన భౌతికంగా తమ మధ్య లేకపోయినా, ఆయన జ్ఞాపకాలు, ఆశయాలు, చేసిన సేవలు తమ హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని భావోద్వేగంతో పేర్కొన్నారు. కార్యక్రమం ప్రార్థనలు, నివాళులు, పుస్తకావిష్కరణతో ఆధ్యాత్మిక వాతావరణంలో సాగింది.

ఎఫ్ఆర్ఏఎస్ యాప్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- **ప్రస్తుత యాప్‌ను మార్చి మెరుగైన ప్రత్యామ్నాయ విధానాన్ని తీసుకురావాలి**
- **గిరిజన, మారుమూల ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలతో ఉపాధ్యాయుల ఇబ్బందులు.. ప్రభుత్వానికి ట్రైబల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ విజ్ఞప్తి**





సింగరేణి (కారేపల్లి), నవంబర్ 21 (పీపుల్స్ డైరీ): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు నమోదుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముఖ గుర్తింపు హాజరు నమోదు విధానం (ఎఫ్ఆర్ఏఎస్) స్వాగతించదగినదేనని, అయితే ప్రస్తుతం అమలులో ఉన్న యాప్‌లో నెలకొన్న సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ట్రైబల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. అవసరమైతే ప్రస్తుత యాప్‌ను మార్చి, అన్ని ప్రాంతాల్లో సమర్థవంతంగా పనిచేసే మెరుగైన ప్రత్యామ్నాయ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేసింది.ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూకర రాంబాబు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాలోత్ ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఎఫ్ఆర్ఏఎస్ యాప్ ద్వారా హాజరు నమోదు చేసే సమయంలో నెట్‌వర్క్ సిగ్నల్ అందకపోవడం, ముఖ గుర్తింపు సరిగా పనిచేయకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాలు, గిరిజన గ్రామాలు, కొన్ని మండల కేంద్రాల్లో సరైన నెట్‌వర్క్ సదుపాయం లేక ఉపాధ్యాయులు సకాలంలో హాజరు నమోదు చేయలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ఉపాధ్యాయులు విధులకు సమయానికి హాజరైనప్పటికీ యాప్‌లో తలెత్తుతున్న సాంకేతిక లోపాల కారణంగా హాజరు నమోదు కాకపోవడం ఆందోళనకరమన్నారు. సాంకేతిక సమస్యలకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు బాధ్యులు కారని, అలాంటి కారణాలతో వారిపై ఎలాంటి ప్రతికూల చర్యలు తీసుకోకూడదని స్పష్టం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి ఎఫ్ఆర్ఏఎస్ యాప్‌లోని నెట్‌వర్క్, ముఖ గుర్తింపు సమస్యలను పరిష్కరించాలని, సమస్యలు పరిష్కారం కాని పక్షంలో మెరుగైన ప్రత్యామ్నాయ యాప్‌ను ప్రవేశపెట్టాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలు, మారుమూల ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో నిరంతరాయంగా హాజరు నమోదు జరిగేలా అవసరమైన సాంకేతిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. నెట్‌వర్క్ లేదా యాప్ సమస్యల వల్ల హాజరు నమోదు కానప్పుడు ప్రత్యామ్నాయ హాజరు నమోదు విధానాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల హాజరు నమోదు కూడా ఎలాంటి అంతరాయాలు లేకుండా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.సాంకేతిక విధానాలు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఇబ్బందులు కలిగించడానికి కాకుండా వారి విధుల నిర్వహణకు సహకరించేలా ఉండాలని వారు పేర్కొన్నారు. ఎఫ్ఆర్ఏఎస్ విధానంలోని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించి, రాష్ట్రవ్యాప్తంగా హాజరు నమోదు ప్రక్రియ సజావుగా సాగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ట్రైబల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ తరఫున మూకర రాంబాబు, మాలోత్ ప్రతాప్ సింగ్ విజ్ఞప్తి చేశారు.

మేడ్చల్‌లో చైనా మాంజా కలకలం.. రూ.25 వేల విలువైన సరుకు సీజ్

- **బట్టల దుకాణం మాటున నిషేధిత చైనా మాంజా విక్రయాలు.. టాస్క్ ఫోర్స్ మెరుపుదాడి**
- **చేతన్ మెన్స్ వేర్ దుకాణంపై ఆకస్మిక తనిఖీలు.. యజమాని చేతన్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు**



మేడ్చల్ (పీపుల్స్ డైరీ):- పక్షుల ప్రాణాలకు, వాహనదారుల భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమిస్తున్న నిషేధిత చైనా మాంజా విక్రయాలపై పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారు. నిషేధం ఉన్నప్పటికీ అక్రమంగా చైనా మాంజాను నిల్వ ఉంచి విక్రయిస్తున్న వారిపై టాస్క్ ఫోర్స్ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం మేడ్చల్ పట్టణంలో నిర్వహించిన మెరుపుదాడిలో రూ. 25 వేల విలువైన చైనా మాంజాను స్వాధీనం చేసుకోవడం స్థానికంగా కలకలం రేపింది. మేడ్చల్ పట్టణంలోని స్ఫూర్తి జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న 'చేతన్ మెన్స్ వేర్' బట్టల దుకాణంలో నిషేధిత చైనా మాంజా విక్రయిస్తున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో పోలీసులు శుక్రవారం సదరు దుకాణంపై ఆకస్మిక దాడి నిర్వహించి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన చైనా మాంజాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మాంజా విలువ సుమారు రూ. 25 వేలుగా పోలీసులు అంచనా వేశారు. బట్టల దుకాణం మాటున నిషేధిత మాంజా విక్రయిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు దుకాణ యజమాని చేతన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సబ్ ఇన్‌స్పెక్టర్ సాయిరాం రెడ్డి వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి చైనా మాంజాను విక్రయించడం, నిల్వ చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. నిషేధిత మాంజా విక్రయాలకు పాల్పడే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.చైనా మాంజా సాధారణ దారం కంటే ప్రమాదకరంగా ఉండటంతో పతంగులు ఎగురవేసే సమయంలోనే కాకుండా రహదారులపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు సైతం ప్రాణాపాయం కలిగించే అవకాశం ఉంది. అంతేకాకుండా చెట్లపై ఎగురుతున్న పక్షులు ఈ మాంజాకు చిక్కుకుని గాయపడటం, ప్రాణాలు కోల్పోవడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. పర్యావరణానికి, ప్రజల భద్రతకు హానికరమైన ఈ నిషేధిత మాంజా విక్రయాలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. మేడ్చల్ పట్టణంలో నిర్వహించిన ఈ దాడితో నిషేధిత చైనా మాంజా విక్రయదారుల్లో ఆందోళన నెలకొంది. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే ఇలాంటి అక్రమ వ్యాపారాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని పోలీసులు స్పష్టం చేశారు. నిషేధిత చైనా మాంజా విక్రయాలు లేదా నిల్వలకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని, పతంగులు ఎగురవేసే ందుకు సురక్షితమైన దారాలను మాత్రమే వినియో గించాలని సూచించారు.

మేడ్చల్‌లో ప్రమాదకరంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మూతలు.. పట్టించుకోని అధికారులు

- **తెరిచి ఉన్న డ్రైనేజీ మూతలతో ప్రజలకు ప్రమాదం.. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నా స్పందించని అధికారులు**



మేడ్చల్: మేడ్చల్ పట్టణంలోని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మూతలు ప్రమాదకరంగా మారుతున్నాయి. పలుచోట్ల డ్రైనేజీ మూతలు తెరిచి ఉండడం, మరికొన్ని చోట్ల మూతలు సరిగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులు, వీధుల్లో తెరిచి ఉన్న డ్రైనేజీల కారణంగా పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో డ్రైనేజీ మూతలు కనిపించకపోవడంతో ప్రమాద భయం మరింత ఎక్కువగా ఉంటుందని ప్రజలు చెబుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు రాకపోకలు సాగించే ప్రాంతాల్లో తెరిచి ఉన్న డ్రైనేజీలు ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రజల భద్రతకు సంబంధించిన సమస్య ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీ మూతలు ఏర్పాటు చేయడం, దెబ్బతిన్న మూతలను మరమ్మతు చేయడం, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ప్రమాదం జరిగే వరకు అధికారులు వేచి చూస్తారా? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి తెరిచి ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలకు వెంటనే మూతలు ఏర్పాటు చేయాలని, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





నర్సంపేటలో చిరు వ్యాపారులపై మున్సిపల్ అధికారుల దౌర్జన్యం

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపులో అధికారుల ద్వంద్వ నీతి

ధనికులకు ఒక న్యాయం.. పేదలకు మరో న్యాయమా? అంటూ ప్రజల ఆగ్రహం

ప్రశ్నించిన వ్యాపారులను బెదిరించి, పండ్ల బండ్లను చెత్త బండ్లలోకి ఎక్కించి తరలింపు

నర్సంపేట, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : పట్టణంలో రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్న చిరు వ్యాపారులపై మున్సిపల్ అధికారులు దౌర్జన్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆక్రమణల తొలగింపు పేరుతో అధికారులు తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారుల పక్కన పండ్లు, ఇతర చిరు వ్యాపారాలు నిర్వహించుకునే వారిపై మున్సిపల్ సిబ్బంది విరుచుకుపడ్డారు. నిబంధనల పేరుతో వ్యాపారులను బెదిరించడమే కాకుండా, తమ గోడును చెప్పుకునేందుకు ప్రయత్నించి ప్రశ్నించిన వారి పట్ల దురుసుగా ప్రవర్తించారు. అంతటితో ఆగకుండా చిరు వ్యాపారుల జీవనాధారమైన పండ్ల బండ్లను బలవంతంగా మున్సిపల్ చెత్త ట్రాక్టర్లు/బండ్లలోకి ఎక్కించి మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. కష్టపడి తెచ్చుకున్న సరుకు పాడైపోతోందని, తమ పొట్ట కొట్టవద్దని వ్యాపారులు వేడుకున్నా అధికారులు కనికరించలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ?ధనికులకు ఒక న్యాయం.. పేదలకు మరో న్యాయమా? మున్సిపల్ అధికారుల తీరుపై పట్టణ ప్రజలు, ప్రజా సంఘాలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. “రోజువారీ కూలీ కంటే తక్కువ ఆదాయంతో బతికే చిరు వ్యాపారులపై ప్రతాపం చూపిస్తున్న అధికారులు.. పట్టణంలో ఏకంగా రోడ్లను, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి శాశ్వత కట్టడాలు నిర్మించిన బడా వ్యాపారులు, ధనికులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?” అని ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఆక్రమణల తొలగింపులో అధికారుల ద్వంద్వ నీతి స్పష్టంగా కనిపిస్తోందని, పేదలకు ఒక న్యాయం, ధనికులకు మరో న్యాయం అమలు చేస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు ఈ విషయంపై స్పందించి సమాధానం చెప్పాలని, స్వాధీనం చేసుకున్న చిరు వ్యాపారుల బండ్లను తిరిగి అప్పగించడంతో పాటు, పెద్ద ఎత్తున ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వారిపై కూడా నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



బాల్య వివాహాలు ప్రోత్సహించడం నేరం!

- డాక్టర్ కె.అనితా రెడ్డి

మట్టెవాడ, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో వరంగల్ శివనగర్ లోని డాన్ బాస్కో నవజీవన్ వీధి బాలల వసతి గృహంలోని పిల్లలకు రగ్గులు, పాదరక్షలు ఉచితంగా కేయూ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ కె.అనితా రెడ్డి ఉచితంగా అందచేశారు. అనంతరం డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు ఆడపిల్లలు, మగపిల్లలను సమానంగా చూడాలి, బాలల హక్కులు, లింగ సమానత్వంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రతి తల్లిదండ్రులు ఆడపిల్లలు, మగపిల్లలను చదివించాలని, చిన్నతనం లోనే బాల్య వివాహాలు చేయవద్దని, బడి మాన్పించి బాల కార్మికులుగా మార్చవద్దని అది చట్టరీత్యా నేరమని డాక్టర్ అనితారెడ్డి అన్నారు, బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి బాలుడు, బాలిక తప్పనిసరిగా పాఠశాలకు వెళ్లాలి కానీ పని ప్రదేశాల్లో ఉండకూడదని, బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఎలాంటి మాదకద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాన్ బాస్కో నవజీవన్ చైర్మన్ ఫాదర్ కోషి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.దివ్య, ఫీల్డ్ కోఆర్డినేటర్ రాజు, శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ జీవిత బీమా ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

నల్లబెల్లి, నవంబర్ 21(పీపుల్స్ డైరీ) : కొండాయిలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం’ ఆన్లైన్ నమోదు ప్రక్రియను జిల్లా ఉన్నతాధికారులు తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ సీఈఓ ఎన్. వసంత, డీఆర్డీఓ నాగపద్మజ, ఆర్డీఓ ఉమారాణి, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ రమణారెడ్డి సంయుక్తంగా పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి, ఆన్లైన్ డేటా ఎంట్రీ, లబ్ధిదారుల వివరాల నమోదు తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఈ బీమా పథకం వర్తించేలా పారదర్శకంగా వివరాలు నమోదు చేయాలని, ఆన్లైన్ ప్రక్రియలో ఎటువంటి సాంకేతిక లోపాలు లేదా జాప్యం జరగకుండా త్వరితగతిన పూర్తి చేయాలని, లబ్ధిదారుల ఆధార్, రేషన్ కార్డు, నామినీ వివరాలను సరిచూసుకుని తప్పులు లేకుండా అప్‌లోడ్ చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అసంపూర్తిగా ఉన్న పండ్ల మార్కెట్ పనులను తక్షణమే పూర్తి చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్

మట్టెవాడ, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్ సమీపంలో లక్ష్మీపురంలో నిర్మిస్తున్న సమీకృత (ఇంటిగ్రేటెడ్) పండ్ల మార్కెట్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, రైతులకు, వ్యాపారులకు అందుబాటులోకి తీసుకురావాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ కోరారు. శనివారం ఆయన మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, పండ్ల మార్కెట్ వ్యాపారులతో కలిసి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని రైతులు, పండ్ల వ్యాపారుల సౌకర్యార్థం సమీకృత మార్కెట్‌లో భాగంగా పండ్ల మార్కెట్ కోసం 85 గదుల నిర్మాణం చేపట్టారని తెలిపారు. అయితే, సకాలంలో నిధులు విడుదల కాకపోవడం, కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పనులు నిలిచిపోవడం వల్ల ఇప్పటికే పూర్తయిన నిర్మాణాలు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరే ప్రమాదం ఉందన్నారు. మరోవైపు సరైన గదులు, కనీస వసతులు లేక పండ్ల వ్యాపారులు, సుదూర ప్రాంతాల నుండి వచ్చే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎండాకాలం, వర్షాకాలంలో సరైన షెడ్లు లేక పండ్లు పాడైపోయి వ్యాపారులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. రైతులు, వ్యాపారుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని, పెండింగ్ బిల్లులు క్లియర్ చేసి అసంపూర్తిగా ఉన్న పనులన్నింటినీ తక్షణమే పూర్తి చేయించాలని వారు కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బైరి మురళీకృష్ణ, పండ్ల మార్కెట్ వ్యాపారులు వెల్ది సాంబయ్య, చెన్నమల్లు యాదవ్, నందప్రియ, అమర్ చందు, సమ్మయ్య, అంజద్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ పాత్రికేయుడు తోకల మల్కయ్య గంగపుత్రకు అభినందనలు

టిజిఎస్ రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర



మల్కాజిగిరి, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : సీనియర్ పాత్రికేయుడు తోకల మల్కయ్య గంగపుత్ర హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజాపక్షం దినపత్రిక 8వ వార్షికోత్సవ వేడుకల్లో ఉత్తమ పాత్రికేయుడిగా ప్రతిభ పురస్కారం అందుకోవడం సంతోషకరమని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి తదితర ప్రముఖుల చేతుల మీదుగా ప్రతిభ పురస్కారంతో ఘనంగా సత్కారం పొందిన తోకల మల్కయ్య గంగపుత్రకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. పాత్రికేయ వృత్తి పట్ల అంకితభావంతో నిబద్ధతతో పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో తోకల మల్కయ్య గంగపుత్ర చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు రానున్న రోజుల్లో ప్రజా సమస్యలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమకాలీన రాజకీయ సామాజిక పరిణామాలపై మరిన్ని చక్కటి వార్తా కథనాలు అందిస్తూ పాఠకుల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఇదే స్ఫూర్తితో పాత్రికేయ రంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ ప్రతిష్టాత్మక అవార్డులు పురస్కారాలు అందుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర తెలిపారు.

కేజీబీవీని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



నల్లబెల్లి, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : నల్లబెల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా గురుకుల విద్యాలయాన్ని (కేజీబీవీ) వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ ఆకస్మిక పర్యటనలో భాగంగా విద్యాలయ ఆవరణలోకి వెళ్లిన కలెక్టర్ అక్కడి పరిస్థితులను, విద్యార్థులకు అందుతున్న వివిధ సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా కస్తూరిబా గురుకుల విద్యాలయంలో విద్యార్థినులకు అందుతున్న విద్య ప్రమాణాలను, బోధనా తీరును ఆమె అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా విద్యాలయంలో విద్యార్థుల కోసం కల్పిస్తున్న వసతులను పరిశీలించి, వాటి నిర్వహణ తీరుపై ఆరా తీశారు. అంతేకాకుండా విద్యార్థులకు ప్రతిరోజూ అందిస్తున్న భోజన నాణ్యతను కూడా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. తనిఖీ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ సత్య శారద విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థినుల మధ్య కూర్చుని వారితో కలిసి భోజనం చేయడం ద్వారా అక్కడి ఆహార రుచి, నాణ్యతను నేరుగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినుల చదువులు, వారి ఆసక్తులు మరియు భవిష్యత్ ప్రణాళికల గురించి కలెక్టర్ ముచ్చటించారు. విద్యార్థులందరూ చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, కష్టపడి చదవాలని ఆమె సూచించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలని విద్యార్థినులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం విద్యాలయ సిబ్బందితో మాట్లాడిన కలెక్టర్ సత్య శారద వారికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. కస్తూరిబా గురుకుల విద్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థులకు తప్పనిసరిగా నాణ్యమైన విద్యను అందించాలని సిబ్బందిని ఆదేశించారు.



ఉత్తమ ఫలితాలు సాధించాలి!

కృష్ణాకాలనీ జూనియర్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే



మట్టెవాడ, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ): వరంగల్ కృష్ణాకాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని నూతన భవనంలోని ఆడిటోరియంలో శనివారం ఫ్రెషర్స్ డే, ఇంటర్ పరీక్షల ఓరియెంటేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇంటర్మీడియేట్ బోర్డు పరీక్షల టైంటేబుల్ ప్రకటించబడిన సందర్భంగా రాబోయే రోజుల్లో విద్యార్థినీ విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయడానికి ప్రత్యేక ఓరియెంటేషన్, ఆట-పాటల ఫ్రెష్స్ డే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా ఇంటర్ విద్యాధికారి డాక్టర్ జి.శ్రీధర్ సుమన్ హాజరయ్యారు. ఈ సందర్భం గా డిఐఈఓ మాట్లాడుతూ విద్యార్థులు ఆట-పాటల్లో రాణించడానికి, స్నేహభావాన్ని పెంపొందించడానికి ఫ్రెషర్స్ డే కార్యక్రమాలు తోడ్పడుతాయని అన్నారు. ఫిబ్రవరి నుండి ప్రారంభమయ్యే ఇంటర్ వార్షిక పరీక్షల్లో మంచి ప్రతిభ కనబర్చాలన్నారు. అంతర్గత మూల్యాంకనంకు సైతం మార్కులున్నందున సిలబస్, ప్రాక్టికల్స్ పై దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పోలిస్తే బాలికల కళాశాలలో విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని, ఈ విద్యా సంవత్సరంలో నూతన భవనం ప్రారంభమవ్వడం శుభసూచకమని అన్నారు. ఆట-పాటల్లో పాల్గొనే కార్యక్రమం వల్ల వారి మధ్య దుస్తుల రూపంలో ఉండే బేధభావాలు దూరం అవుతాయని, విద్యార్థుల ఐక్యతకు దోహద పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శరదృతి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ధర్మేంద్ర, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిఎంఎస్ మండల కార్యదర్శిగా కుమారస్వామి



నల్లబెల్లి, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : దళిత మేధా శక్తి నల్లబెల్లి మండల ప్రధాన కార్యదర్శిగా కొయ్యడ కుమారస్వామి, మండల అధికార ప్రతిని ధిగా జన్ను రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దళిత మేధా శక్తి వ్యవస్థాపక అధ్యక్షులు న్యాయవాది బోట్ల పవన్ సూచన మేరకు సంస్థ వ్యవస్థాపక సభ్యులు పెంబర్తి శ్రీనివాస్, అడ్డ రాజు శనివారం వీరి నియామకాలను ప్రకటించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక సభ్యులు పెంబర్తి శ్రీనివాస్, అడ్డ రాజు మాట్లాడుతూ... ఇప్పుడిప్పుడే దళితులు చైతన్యవంతులవుతున్న తరుణంలో కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం దళితుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి, గందరగోళం సృష్టించి సమాజాన్ని విచ్ఛిన్నం చేయాలని కుట్ర పన్నుతున్నారని, వారి పట్ల దళిత సమాజం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత మేధా శక్తి ఆవిర్భావ సభ్యులు బోట్ల దయాకర్, శనిగరం సంపత్, గంగారపు వినయ్, కనకం నవీన్, నత్తి చిరంజీవి, మాట్ల మహేష్, దుగ్గొండి మండల అధ్యక్షులు కుక్కమూడి గోవర్ధన్, నల్లబెల్లి మండల అధ్యక్షులు జన్ను కార్ణాకర్, చెన్నారావుపేట మండల అధ్యక్షులు పసునూరి నవీన్, నర్సంపేట మండల అధ్యక్షులు కుక్కమూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ కార్పొరేషన్‌కు వెయ్యి కోట్లు కేటాయించాలి

ముదిరాజ్ మహాసభ నాయకుల డిమాండ్



దుగ్గొండి, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : ప్రపంచ మత్స్య కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని దుగ్గొండి మండలంలోని 22 గ్రామపంచాయతీలలో ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర, జిల్లా నాయకులు జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఎన్నారై సెల్ కన్వీనర్ సనబోయిన రాజ్ కుమార్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్ కార్పొరేషన్‌కు తక్షణమే రూ. 1000 కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆ నిధులతో ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టి, ముదిరాజ్ కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం తోడ్పాటు అందించాలని కోరారు. ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు పొన్నం మొగిలి జెండా పండుగను ఉద్దేశించి మాట్లాడుతూ ముదిరాజులను ప్రస్తుతం ఉన్న బీసీ-డి జాబితా నుండి బీసీ-ఏ లోకి మార్చాలి. ఉచిత చేప పిల్లల పంపిణీకి బదు లుగా, నేరుగా మత్స్యకారుల ఖాతాల్లోకి నగదు బదిలీ చేయాలి. ఎల్‌నినో ప్రభావం వల్ల చెరువుల్లో నీరు లేక మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నందున, చెరువుల రకం (శిస్తు) ను పూర్తిగా రద్దు చేయాలి. మత్స్య సహకార సంఘ సభ్యులకు గతంలో మాదిరిగానే ప్రమాద బీమా సౌకర్యాన్ని పునరుద్ధరించి అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పొన్నం మొగిలి ముదిరాజ్ వరంగల్ జిల్లా తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఎన్నారై సెల్ రాష్ట్ర కన్వీనర్ శానబోయిన రాజ్ కుమార్ ముదిరాజ్ వరంగల్ జిల్లా తెలంగాణ ముదిరాజ్ మహాసభ యూత్ జిల్లా కార్యదర్శి నాయిని వేణుచంద్ ముదిరాజ్ తెలంగాణ ముదిరాజ్ మహాసభ దుగ్గొండి మండల అధ్యక్షులు పల్లె రమేష్ ముదిరాజ్ దుగ్గొండి మండల ముదిరాజ్ మహాసభ మండల ఉపాధ్యక్షులు వరంగంటి తిరుపతి ముదిరాజ్ దుగ్గొండి గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ పల్లె శ్యామ్ ముదిరాజ్ మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు సోడా సమ్మయ్య రాజు శ్రీను మండల మాజి సహకార సంఘం అధ్యక్షులు కుల పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ ఆవిర్భావం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం



ఖమ్మం నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం, తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఖమ్మం నగరంలోని 14వ డివిజన్, కొత్తగూడెంలో స్థానిక సిపిఐ కొత్తగూడెం శాఖ కార్యాలయం వద్ద మత్స్యకారులు, తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ కార్యాలయంలో సభ నిర్వహించారు. సభకు తెలంగాణ ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు, కుల పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఖమ్మం జిల్లా అధ్యక్షులు రావుల హనుమంతరావు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఖమ్మం జిల్లా అధ్యక్షులు రావుల హనుమం తరావు, గౌరవ అధ్యక్షులు పగడాల మల్లేష్, మాజీ కార్పొరేటర్ కొప్పెర ఉపేందర్ మాట్లాడుతూ... మత్స్యకారుల సంక్షేమానికి, తెలంగాణ ముదిరాజ్ సమాజం హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మత్స్యకార కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం మరిన్ని చేయూత నివ్వాలని, కులవృత్తులను కాపాడుకుంటూనే యువత విద్యా, ఉద్యోగ రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షులు లింగనబోయిన లక్ష్మణ్, ఉపాధ్యక్షులు పగడాల అనంతరాములు, ఉద్యోగ సంఘాల అధ్యక్షులు అక్కి కోటయ్య, కార్యదర్శులు నర్రా శ్రీను, చింతల వెంకన్న, యూత్ అధ్యక్షులు పొన్నెబోయిన సాయి, జిల్లా నాయకులు తిప్పట్ల నర్సింహారావు, యూత్ జిల్లా నాయకులు లింగనబోయిన సతీష్, తవడబోయిన కృష్ణ, వెంగంపల్లి సురేష్, అరిగె నాగేశ్వర రావు, కుడితి సురేష్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ బోనకల్ మండలం అధ్యక్షులు రెడ్డెబోయిన ఉద్ధండు, మత్స్యశాఖ కార్యదర్శి పోతల నర్సింహారావు, మత్స్యశాఖ అధ్యక్షులు మద్దరబోయిన అప్పారావు, కొత్తగూడెం తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు బుడిగె వెంకన్న, కార్యదర్శి రావుల సంజీవరావు, పోతురాజు వెంకటేశ్వర్లు, మాకనబోయిన నాగేశ్వరరావు, పగడాల వెంకటేశ్వర్లు, తుపాకుల శ్రీకాంత్, లక్కా వీరయ్య, బడెగ ఉపెందర్, దుస్స శ్రీను, తదితరులున్నారు.



మొగుళ్ళపల్లిలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

మొగుళ్లపల్లి, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం మొగుళ్లపల్లి అధ్యక్షుడు రావిశెట్టి రమేష్ ఆధ్వర్యంలో. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని మొగుళ్ళపల్లిలోని ప్రధాన కూడలిలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముదిరాజ్ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు జోరుక సదయ్య ఈ కార్యక్రమంలో పాల్గొని ముదిరాజ్ సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో. మొగుళ్ళపల్లి మండల ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి దేవునూరి కుమారస్వామి, నీరటి మహేందర్, బోళ్ళ సాంబమూర్తి , దేవునూరి బొండ్యాలు, చెక్క సాంబయ్య, దండు కుమారస్వామి, దేవునూరి సాంబయ్య, వెంగళ పవన్ , దేవునూరి అశోక్, పుట్ట అజయ్, రవి ,బీర్తి రాజు బండారి రాజేష్ , కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రపంచ మత్స్యకార దినోత్సవ వేడుకలు



గణపురం, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : ప్రపంచ మత్స్యకార దినోత్సవం, ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు బోయిని సాంబయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు చాడ కృష్ణస్వామి మాట్లాడుతూ... చెరువుల్లో నీరు సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో చేప పిల్లలను వంద శాతం పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నీలం మధు ముదిరాజ్‌కు ఎమ్మెల్సీ పదవి కల్పించాలని, ముదిరాజులను బీసీ-ఏలోకి మార్చే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలో పండుగల సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గంద్ర సత్యనారాయణరావును కోరారు. ఈ కార్యక్రమంలో గణప సముద్రం మత్స్యశాఖ సొసైటీ డైరెక్టర్ గుల్ల రాజకుమార్, కొండాపురం సర్పంచ్ మధ్యల విజయ అశోక్, సోషల్ మీడియా ఇంచార్జ్ జోడు ప్రదీప్ ముదిరాజ్, ధర్మారావుపేట మాజీ ఉపసర్పంచ్ ఆకుల తిరుపతి, గాంధీనగర్ ముదిరాజ్ కులపెద్ద బోళ్ల బాలకృష్ణ, బుద్ధారం ముదిరాజ్ కుల పెద్ద మల్లెబోయిన రజినీకాంత్ తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి జిల్లా ఇంచార్జ్ మాల వంశీ ముదిరాజ్, గణపురం మండల ముదిరాజ్ మహాసభ యూత్ అధ్యక్షులు పెండ్యాల వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వేడుకలు



కేసముద్రం, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : మత్స్యకారుల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మున్సిపల్ చైర్ పర్సన్ సునీత వెంకన్న అన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రపంచ మత్స్యకారుల దినోత్సవంలో చైర్ పర్సన్ అన్నారు.మహబూబాబాద్ జిల్లా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ముదిరాజ్ రాష్ట్ర నాయకులు నీలం దుర్గేష్, సభ అధ్యక్షులు లింగాల పిచ్చయ్య ఆధ్వర్యంలో మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సభ అధ్యక్షులు లింగాల పిచ్చయ్య జెండా ఆవిష్కరించి మత్స్యకారులకు ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ముదిరాజ్ రాష్ట్ర నాయకులు నీలం దుర్గేష్ మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి, ఆర్థిక స్వావలంబనకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచి, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉచిత చేప పిల్లల పంపిణీ, సబ్సిడీపై ద్విచక్ర వాహనాలు, బాధ్యతా సాధనాలు, నాలుగు చక్రాల వాహనాలు, పంట పథకాల ద్వారా మత్స్యకారుల జీవనోపాధికి ప్రభుత్వం తోడ్పాటునంది స్తోందని తెలిపారు. గతంలో నిర్లక్ష్యానికి గురై శిథిలావస్థకు చేరుకున్న చెరువులను పునరుద్ధరించి, మత్స్య సంపద అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టడం ద్వారా మత్స్యకార కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. మత్స్యకారుల కష్టానికి తగిన గుర్తింపు, వారి వ్యక్తికి గౌరవం, వారి కుటుంబాలకు భరోసా కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో దస్రు నాయక్, కౌన్సిలర్లు, సర్పంచ్ సూరయ్య,సత్యం ముదిరాజ్ యువ నాయకులు బుడుగబోయిన అశోక్, సింగని యాకన్న, మహేష్, వెంకటేష్, ప్రభాకర్, అశోక్, చెన్నబోయిన శ్రీనాథ్, ముదిరాజ్ సంఘం సొసైటీ అధ్యక్షులు ముదిరాజ్ కుల కుల సభ్యులు మండల, గ్రామ పట్టణ కమిటీల నాయకులు, సభ్యులు, వివిధ పార్టీ ల నాయకులు కార్యకర్తలు, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మత్స్య కార్మిక దినోత్సవ సందర్భంగా జెండావిష్కరణ



నర్సంపేట, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : ప్రపంచ మత్స్య కార్మిక దినోత్సవ సందర్భంగా మాదన్నపేట మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి ముదిరాజ్ ముదిరాజ్ మహాసభ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజులను బీసీ-డి నుండి బీసీ-ఏ కు మార్చాలని, ఉచిత చేప పిల్లలకు బదులు నగదు బదిలీ చేయాలి అని ఎల్‌నినో కారణంగా చెరువుల్లో నీరు లేనందున జిల్లా లో చెరువుల రకం రద్దు చెయ్యాలి.మత్స్య సహకార సభ్యునికి గతం లో మాదిరిగా ప్రమాద భీమాను కొనసాగించాలి.50 సంవత్సరాలు నిండిన ప్రతి మత్స్య కార సభ్యునికి చేయుత్ పింఛన్ ఇవ్వాలి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఎన్నారై సెల్ కన్వీనర్ శానబోయిన రాజ్ కుమార్ జెండా పండుగను ఉద్దేశించి మాట్లాడుతూ...రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ కు 1000 కోట్ల నిధులు కేటాయించి ముదిరాజ్ కుటుంబాలకు ఆర్థికంగా ఎదిగెందుకు స్కీమ్స్ ప్రవేశ పెట్టాలి అని ఈ ప్రభుత్వన్ని ప్రపంచ మత్స్య కార్మికుల దినోత్సవం సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు జినుకల కొమ్ములు, జిల్లా యువత కార్యదర్శి నాయిని వేణుచంద్, చీఫ్ ప్రమోటర్ జినుకల నర్సయ్య, మాజీ అధ్యక్షులు దండు రవి, గీరబోయిన రాజేందర్, కుల పెద్దమనిషి దండు రామ్ నర్సు, జల్లి ఐలయ్య, కోశాధికారి మారపాక రమేష్, వార్డ్ మెంబర్ దండు రమేష్, పోలబోయిన నూతన్ కుమార్, రమేష్, నిమ్మల శ్యామ్ రాజ్, తెప్ప చిరంజీవి, సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం



చిట్యాల, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : చిట్యాల మండల కేంద్రంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం ముదిరాజు మహాసభ 12వ ఆవిర్భావ దినోత్సవాలను చిట్యాల మత్స్య సహకార సొసైటీ అధ్యక్షులు సంకెళ్ళ చంద్రయ్య ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి చింతల రమేష్ ముదిరాజ్ జిల్లా అధ్యక్షులు జోరుకసదయ్య ముదిరాజులు పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు ముదిరాజులను బిసి-డి నుండి ఏ గ్రూపులో చేరుస్తామని ?3,000 కోట్లతో ముదిరాజ్ సంక్షేమం కోసం నిధులను సమకూర్చుతామని ముదిరాజుల పిల్లలు చదువుకోడానికి ప్రత్యేక వసతులను కల్పిస్తామని చేపలు పట్టుకునేందుకు అమ్ముకునేందుకు కావలసిన సదుపాయాలను ఏర్పాటు చేసి ఆదుకుంటామని హామీలు ఇచ్చి గద్దినెక్కిన ప్రభుత్వం మత్స్యకారుల కోసం ఏమీ చేయలేదని వారు ఆరోపించారు. నిండిన చెరువులలో ఇప్పటివరకు చేప పిల్లలను పోయలేదని వారన్నారు. చేప విత్తనాలకు అందించే సబ్సిడీని తక్షణమే సంబంధిత సొసైటీలలో జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సాధ మల్లయ్య పిట్టల రాజమౌళి నాయకులు గుండ రవీందర్ నిమ్మల నరేష్ పిట్టల రవి గుండ సురేష్ పిట్టల రామచందర్ పిట్టల అనిల్ పిట్టల సాంబయ్య గుండ సంతోష్ గుండా ఓదెలు సాదా శ్రీనివాస్ గోలకొండ శ్రీనివాస్ గోలకొండ మొగిలి పిట్టల నాగరాజ్ గుండా మొగిలి పిట్టల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎఫ్‌పీఓపై అవగాహన

మంగపేట నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : ములుగు జిల్లా మంగపేట మండలం బుచ్చంపేట గ్రామంలో రైతులకు ఎఫ్‌పీఓ (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) గురించి రైతు సేవ సహకార సంఘం సీఈఓ అల్లి గౌరమ్మ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు ఎఫ్‌పీఓ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సహకార సంఘం బుచ్చంపేట డైరెక్టర్లు చిట్టిమల్ల రజిత, చిట్టిమల్ల సమ్మయ్య మాట్లాడుతూ రైతులకు ఎఫ్‌పీఓ సభ్యత్వం ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. రూ.2,000 చెల్లించి సభ్యత్వం పొందిన రైతులకు నాబార్డ్ నుంచి మరో రూ.2,000 అదనంగా లభిస్తుందని, దీంతో రైతు వాటా మూలధనం రూ.4,000 అవుతుందని వివరించారు. రైతులు తాము పండించిన పంటలను రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా కొనుగోలు, అమ్మకాలు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా సహకార సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై పొందవచ్చని పేర్కొన్నారు. ఎఫ్‌పీఓ సభ్యత్వం ద్వారా రైతులు సంఘటితంగా ఉండి వ్యవసాయ రంగంలో మరిన్ని ప్రయోజనాలు పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు బూర్గుల వెంకటమల్లు, గడ్డం పరమేష్, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు. రైతులు ఎఫ్‌పీఓ సభ్యత్వాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.



గుడుంబా తయారీపై పోలీసుల ఉక్కుపాదం

4,000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం.. 50 లీటర్ల నాటుసారా స్వాధీనం



కేసముద్రం, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : మహబూబాబాద్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో శనివారం ఉదయం 05:30 గంటల నుంచి 07:30 గంటల వరకు కేసముద్రం మండల పరిధిలోని చెరువుముంతు తండా, బోడమాచ తండాల్లో చుట్టుముట్టి తనిఖీ కార్యక్రమం నిర్వహించారు.కేసముద్రం, నెల్లికుదురు, ఇనుగుర్తి పోలీసు కేంద్రాల ఉప పరిశీలకులు, వృత్త పోలీసు సిబ్బందితో కలిసి నిర్వహించిన ఈ తనిఖీల్లో అక్రమంగా నాటుసారా తయారీ, నిల్వ, రవాణా చేస్తున్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో భాగంగా 4,000 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేయడంతో పాటు, 50 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా 50 ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి వాటి రికార్డులు, ధ్రువపత్రాలను పరిశీలించారు.అనంతరం తండావాసులకు గంజాయి వినియోగం, అంతర్రాల నేరాల పట్ల అప్రమత్తత, బాలల లైంగిక వేధింపుల నిరోధక చట్టం, బాల్యవివాహాల నిరోధం తదితర అంశాలపై పోలీసు అధికారులు అవగాహన కల్పించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని కేసముద్రం వృత్త పరిశీలకుడు సత్యనారాయణ తెలిపారు.



లక్ష్యసాధనలో క్రమశిక్షణ కీలకం

చెన్నూర్, నవంబర్ 21(పీపుల్స్ డైరీ) : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాల యం కెజీవీబి విద్యార్థినుల కోసం నిర్వ హించిన ప్రత్యేక వ్యక్తిత్వ వికాస, ప్రేరణాత్మక కార్యక్రమానికి ప్రముఖ మోటి వేషనల్ స్పీకర్ ఎం.జయకృష్ణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకో వాలని, వాటిని చేరుకోవడానికి క్రమశిక్ష ణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నిరంతర కృషి ఎంతో అవసరమని వివరించారు. విద్యార్థినుల్లో నూతన ఉత్సాహాన్ని, సానుకూల ఆలోచనా విధానాన్ని నింపిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారిణి సుమలత ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

కేసముద్రంలో పోలీసుల ముమ్మర తనిఖీలు

కేసముద్రం, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు క్రాంతి కిరణ్, కరుణాకర్, నరేష్ తో పాటు మూడు పోలీస్ స్టేషనులకు సంబంధించిన పోలీసు సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పట్టణంలోని రైల్వే స్టేషన్ తో పాటు పలు ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాలు, అనుమానాస్పద ప్రదేశాల్లో వ్యక్తులు, వాహనాల కదలికలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితులను ఆపి వివరాలు ఆరా తీయడంతో పాటు వాహనాల పత్రాలను తనిఖీ చేశారు.నిషేధిత వస్తువుల అక్రమ రవాణా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఈ తనిఖీలు స్పష్టం చేస్తున్నాయి. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు, అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా పోలీసులు ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ప్రజలు కూడా అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని సీఐ కోరారు.



అర్హులైన ప్రతి కుటుంబం బీమాను సద్వినియోగం చేసుకోవాలి!

రేపటి నుంచి అన్ని డివిజన్లలో నమోదు ప్రారంభం - జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న



మట్టెవాడ, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ): అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న అధికారులకు సూచించారు. అర్హులైన వారెవరూ ఈ అవకాశాన్ని కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శనివారం వరంగల్‌లోని ఉర్సు కరీమాబాద్ 40వ డివిజన్ కమ్యూనిటీ రిసోర్స్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాన్ని కమిషనర్ సందర్శించి, లబ్ధిదారుల వివరాల నమోదు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జీడబ్ల్యూఎంసీ పరిధిలోని కొన్ని డివిజన్లలో శనివారం నుంచే నమోదు ప్రారంభించామని, సోమవారం (నవంబర్ 23) నుంచి అన్ని డివిజన్లలోని సంబంధిత కేంద్రాల్లో ఈ ప్రక్రియ అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. 18 నుంచి 59 సంవత్సరాల వయసు కలిగిన తెల్ల రేషన్ కార్డు దారులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే రూ.5 లక్షల బీమా రక్షణ వర్తిస్తుందని స్పష్టం చేశారు. అర్హత కలిగిన వారు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో పాటు కుటుంబ సభ్యుల ఆధార్ వివరాలను తీసుకుని సంబంధిత డివిజన్ నమోదు కేంద్రాల్లో వివరాలు సమర్పించాలని సూచించారు. కుటుంబానికి ఆర్థిక ఆధారమైన వ్యక్తి అనుకోని పరిస్థితుల్లో మరణించినప్పుడు ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని, బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని కమిషనర్ వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకంలో నమోదు చేసుకుని ప్రభుత్వ భరోసాను పొందాలని కోరారు. ఈ పరిశీలనలో డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, రెవెన్యూ అధికారి శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కుటుంబంలో బీమా నింపడమే పథకం లక్ష్యం

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి





నర్సంపేట, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, ప్రతి కుటుంబానికి అండగా నిలవాలనే సంకల్పంతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. కుటుంబ పెద్దకు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా జీవిత బీమా ద్వారా భరోసా కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకం ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





సృజనాత్మకతను వెలికితీయడానికే చెకుముకి

సీఐ వై.సతీష్

చిట్యాల, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టును చిట్యాల ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించామని మండల విద్యాధికారి కోడెపాక రఘుపతి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చిట్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ వై సతీష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను శాస్త్రీయ ఆలోచన విధానాన్ని వెలికితీయడానికి, ఆలోచన శక్తిని పెంపొందించడానికి చెకుముకి పరీక్ష దోహదపడుతుందని అన్నారు. మాదకద్రవ్యాలు మహమ్మారి వంటివి అని వాటిని సమాజమంతా ఒక్కటై తరిమికొట్టాలని ఆరోగ్యవంతమైన సమాజం ఉంటేనే భారతదేశం అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో ఉంటుందని అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక శాస్త్రవేత్త వలె చరిత్రలో తనకంటూ ఒక పేరును లికించుకోవాలని విద్యాభ్యాస సమయంలో ఏమైనా సందేహాలు ఉంటే నిర్భయంగా ఉపాధ్యాయులను అధ్యాపకులను అడిగి తెలుసుకోవాలన్నారు. మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలు రెసిడెన్షియల్ పాఠశాలల నుండి చెకుముకి టాలెంట్ టెస్ట్ కు హాజరయ్యారని చెకుముకి మండల కన్వీనర్ సూదం సాంబమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చెకుముకి టాలెంట్ టెస్ట్ లో జెడ్పిహెచ్ఎస్ నైన్ పాక ప్రథమ స్థానం జడ్పీహెచ్ఎస్ జూకల్ ద్వితీయ స్థానం ప్రైవేటు పాఠశాలల విభాగంలో శ్రీ వివేకానంద పాఠశాల ఒడితల ప్రథమ స్థానం కాకతీయ హై స్కూల్ ద్వితీయ స్థానం రెసిడెన్షియల్ పాఠశాలల విభాగంలో సోషల్ వెల్ఫేర్ వెలుగు ప్రథమ స్థానం కేజీబీవీ చిట్యాల ద్వితీయ స్థానం సాధించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీరాం రఘుపతి సైన్స్ ఉపాధ్యాయులు బిట్ల సరళాదేవి జి విజయలక్ష్మి మురారి కల్పన కుచనపల్లి శ్రీనివాస్ సిరివెన్నెల మారబోయిన మహేందర్ జయంతి సుమన్ కోటేశ్వర్ దివ్యా శరత్ తదితరులు పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలను ఈనెల 28వ తేదీన భూపాలపల్లిలో జరగబోయే జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తామని చెకుముకి మండల కన్వీనర్ సూదం సాంబమూర్తి తెలిపారు.

పీపుల్స్ డైరీపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలి

జాతీయ అవార్డు గ్రహీత పుల్ల మల్లయ్య



చిట్యాల, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యలను అలాగే అక్రమ సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్న అవినీతి చీకటి వ్యవహారాలను వెలుగులోకి తీసుక వచ్చి అవినీతి అక్రమాలపై నిర్భయంగా వార్తలు ప్రచురించిన దమ్మున్న పీపుల్స్ డైరీ పత్రికపై అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ జాతీయ అవార్డు గ్రహీత పుల్ల మల్లయ్య సంబంధించిన అధికారులను డిమాండ్ చేశారు. చిట్యాల మండల కేంద్రంలో శనివారం మల్లయ్య మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అవినీతి అక్రమాలను వెలుగులోకి తీసుకవచ్చే పత్రికపై కేసులు నమోదు చేయడం పత్రిక స్వేచ్ఛకు ప్రజాస్వామ్య విలువలకు ప్రజాస్వామిక హక్కులకు భంగం కలిగించడమే అన్నారు. ప్రజా సమస్యలను ప్రశ్నించడం పత్రికల హక్కు అని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అక్రమాలు అవినీతిని వెలుగులోకి తీసుక రావడం వారి బాధ్యతన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో జరుగుతున్న అవినీతి సంఘటనలను పీపుల్స్ డైరీ పత్రికలో వరుస కథనాలు ప్రచురించడం అభినందనీయమన్నారు.

పీపుల్స్ డైరీపై కేసులు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరం

మండల అధ్యక్షులు జన్నే యుగంధర్

చిట్యాల, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : అనేక ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి ప్రజలకు అణగారిన వర్గాలకు పీడితులకు బాధితులకు అండగా నిలబడుతున్న పీపుల్స్ డైరీ తెలుగుదినపత్రిక పై అలాగే మహబూబాబాద్ పీపుల్స్ డైరీ పత్రిక రిపోర్టర్ పై అక్రమ కేసులు పెట్టడం ప్రజాస్వామ్య వ్యవస్థకు పత్రిక స్వేచ్ఛకు ప్రమాదకరమని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల అధ్యక్షులు జన్నే యుగంధర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్లో జరుగుతున్న అవినీతి వ్యవహారాన్ని బట్ట బయలు చేసి నిజా నిజాలను పీపుల్స్ డైరీ పత్రిక ప్రచురించినందుకు పత్రికపై రిపోర్టర్ పై తప్పుడు కేసులు బనాయించి కేసులతో వేధించడం సరైనది కాదన్నారు. పీపుల్స్ డైరీ పత్రికపై జర్నలిస్టుపై పెట్టిన కేసులను ఉపసంహరించు కోవాలని పత్రికా స్వేచ్ఛపై సాగే దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.



ఇందిరమ్మ జీవిత బీమా నమోదును విజయవంతం చేయాలి : ఎండీఓ జయశ్రీ



చిట్యాల, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంను మండలంలో ఈనెల 19 నుండి వచ్చేనెల 18 వరకు జరుగు నమోదు కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సమాజంలోని ప్రజలకు ఆర్థిక భద్రత మరియు సామాజిక రక్షణను బలోపేతం చేయడానికి రూ.5 లక్షల రూపాయల బీమా తో రక్షణ కల్పించి ఇతర పథకాల పరిధిలోకి రాని కుటుంబాల కు జీవిత బీమా సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకమును ప్రారంభించింది అన్నారు. బీమా నమోదు సమయంలో బీమా పొందే వ్యక్తి వయసు 18 నుండి 59 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. చిట్యాల మండలంలో నాలుగు పేజ్ లలో జీవిత బీమా కార్యక్రమాల నమోదు నిర్వహించబడుతుంది అన్నారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరిని గ్రామపంచాయతీల నందు జరుగు నమోదు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

నేటి మాదిగ మహారాజుల శోభాయాత్రను విజయవంతం చేయండి

చిట్యాల, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో మాదిగ జాగృతి సంఘం ఆధ్వర్యంలో శనివారం మాదిగల్ని రాజుల్ని చేసిన కాన్షీరామ్ ని స్మరిస్తూ నేడు అనగా నవంబర్ 22 ఆదివారం రోజున మాదిగ మహారాజుల శోభాయాత్ర నిర్వహించడం జరుగుతుందని పోస్టర్స్ ఆవిష్కరించి ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ జాగృతి సంఘం భూపాలపల్లి జిల్లా కన్వీనర్ పర్లపెల్లి వంశీ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవజాతి మూలపురుషుడు భూమండలాన్ని పరిపాలించిన మొదటి మహారాజు ఆదిదేవుడు దేవదేవుడు మహాదేవుడే ఆది జాంబవ మహారాజ్ అని ఆయనే మన చారిత్రక జాంబవంతుడు అలాంటి రాజుల బిడ్డలమని సగర్వంగా ప్రకటించుకుంటుంది నేడు మాదిగ జాతి అన్నారు. ఒకప్పుడు ఇంత గొప్ప చరిత్ర కలిగిన మాదిగ జాతి నేడు అంటరాని కడజాతిగా సామాజిక రాజకీయ జీవితం లేకుండా అయిపోయిందని మళ్లీ ఆ కడజాతిని ప్రథమజాతిగా నిలబెట్టడానికే యుగాల తర్వాత సామాజిక విప్లవం ఫూలే- అంబేద్కర్లు ప్రజాస్వామ్యం రాజ్యాంగం రూపంలో పుట్టుకొచ్చాయన్నారు. భారీ రాజకీయ యుద్ధం చేసి మళ్లీ మనకు రాజ్యాధికార రుచిని చూపించిన యుద్ధ వీరుడే మాన్యశ్రీ కాన్షిరాం అని ఆ కాన్షిరాం 20 ఏళ్ల మృతి సంఘటన దినాన్ని స్మరిస్తూ ఆదిజాంబవ మహారాజు శోభయాత్రలని తెలంగాణ అంతట జరుపుతున్నాం అని అందులో భాగంగానే వరంగల్ నడివీధులలో మహాదిగల శోభాయాత్రని చేయబోతున్నాం అన్నారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా మనస్ఫూర్తిగా బీసీ ఎస్సీ ఎస్టీ అన్నదమ్ములందరినీ ఆహ్వానిస్తున్నాం అని అన్నారు. అంతేకాకుండా పార్టీలకతీతంగా ప్రజలందరూ విద్యావంతులు మేధావులు ఉద్యోగస్తులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిట్యాల వార్డ్ మెంబర్ శనిగరపు మొగిలి ఎంజెఎస్ భూపాలపల్లి జిల్లా కో కన్వీనర్ పుల్ల అశోక్ చిలుముల కృష్ణ మట్టేవాడ కుమార్ నేరెళ్ల రమేష్ బొడ్డు పాల్ చరణ్ పుల్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ఒంటరి పురుషులకు పింఛన్ ఇవ్వాలి



చిట్యాల, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : ఒంటరి మహిళల మాదిరిగా ఒంటరి పురుషులకు కూడా తెలంగాణ రాష్ట్రప్రభుత్వం చేయూత పింఛను రూ. 2016 అందించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన ఒంటరి పురుషులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భార్య చనిపోవడంతో లేదా వదిలి వేయడంతో గాని అదేవిధంగా 40 సంవత్సరాలు దాటిన పెళ్లి గాని ఒంటరి పురుషులం ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని పరిస్థితిలో ఉన్నామని పనులు చేయడానికి తమ ఆరోగ్యం సహకరించడం లేదని పిల్లల చదువులకు కుటుంబాల పోషణకు ఒక్కరమే కూలీ పనులు చేసి కుటుంబాన్ని సాదడం కష్టంగా మారిందన్నారు. ప్రభుత్వం స్పందించి ఒంటరి పురుషులమైన తమకు చేయూత పింఛన్లు మంజూరు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. వృద్ధాప్య పింఛన్ పొందాలంటే 57 ఏండ్ల వరకు వెయిట్ చేయాల్సిన పరిస్థితితో తమ జీవనం అగమ్యగోచరంగా మారిందన్నారు. ప్రభుత్వం అధికారులు స్పందించి ఒంటరి మహిళల మాదిరిగా ఒంటరి పురుషులమైన తమకు పింఛన్లు మంజూరు చేసి ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాధితులు మ్యాదరి వీరస్వామి జాలిగపుశంకర్ రౌతు సాయిరాం కొల్లూరి సాంబయ్య బామర్ మోతిలాల్ దేవులపల్లి రమేష్ విద్యాసాగర్ సతీష్ లక్ష్మినరసింహ స్వామి తదితరులు ఉన్నారు.

ఇంగ్లీష్ ఒలంపియాడ్ మండల స్థాయి పరీక్ష



చిట్యాల, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : జడ్పిహెచ్ఎస్ చిట్యాల ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ(ఎల్టా) ఆధ్వర్యంలో ఇంగ్లీష్ ఒలంపియాడ్ మండల స్థాయి పరీక్ష శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐ వై సతీష్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి మరియు మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతి హాజరై క్యూస్షన్స్ పేపర్స్ ఇనాగరేషన్ చేయడం జరిగింది. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు 19 డిసెంబర్ 2026న జరుగు జిల్లా స్థాయి పోటీలకు ఆ తరువాత 2 జనవరి 2027 న జరుగు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల నుంచి ఆంగ్ల ఉపాధ్యాయులు నీలిమారెడ్డి సాధు మమత జయశ్రీ ధర్మపురి వాణి రజిత హాజరయ్యారు.

వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర

గణపురం, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : గణపురం మండల కేంద్రానికి చెందిన చెందిన పోతర్ల రజిత మల్లికార్జున యాదవ్ దంపతుల కుమార్తె వివాహ వేడుకకు శనివారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతే కరుణాకర్ రెడ్డి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పీఏసీఎస్‌లకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలి : పెద్ద ఐలయ్య

నల్లబెల్లి, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసా య సహకార సొసైటీలకు వెంటనే ఎన్నికలు నిర్వహించి ప్రజాస్వామ్య స్ఫూర్తిని కొనసాగించాలని రైతు సంఘం నల్లబెల్లి మండల కార్యదర్శి మామిండ్ల పెద్ద ఐలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన నల్లబెల్లి గ్రామపంచాయతీ ఆవరణలో సామాల లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల వాటా ధనంతో ఎన్నో దశాబ్దాలుగా కొనసాగుతున్న సొసైటీలకు, రైతులే ఎన్నికల ప్రక్రియ ద్వారా పాలకవర్గాలను ఎన్నుకునే సంప్రదాయం ఉందన్నారు. అయితే, పాలకవర్గాల గడువు తీరినా ఎన్నికలు జరపకపోగా, ఇవి ప్రభుత్వ సంస్థలు కానప్పటికీ నామినేటెడ్ పోస్టుల ద్వారా ఏకపక్షంగా పాలకవర్గాలను నియమించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. రైతులకు ఎంతో ఉపయోగపడే సొసైటీలకు బైలా నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించకుండా, రైతులు హైకోర్టును ఆశ్రయించే పరిస్థితి రావడానికి ప్రభుత్వం అనుసరించిన అప్రజాస్వామిక విధానాలే కారణమని ఆరోపించారు. రెండు వారాల్లో సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు సైతం రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినట్లు మీడియాలో వార్తలు వచ్చాయని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే సహకార సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పరికి కోర్నేలు, కడియాల క్రాంతి కుమార్, మూటికె కుమారస్వామి, నల్లోల్ల కుమారస్వామి, బూస రాంమూర్తి, సామాల సాంబయ్య, వైనాల జంపయ్య, పండుగ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



పీపుల్స్‌డైరీ
కరీంనగర్
ఆదివారం, 22 నవంబర్ 2026
సంపుటి : 18, సంచిక : 238



ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం.. పరారీలో మరో ఇద్దరు నిందితులు

ఖమ్మం, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : ఖమ్మం బోనకల్ రోడ్డులో వన్ టౌన్ ఎస్సై వీరేందర్ తన పోలీస్ సిబ్బందితో కలసి నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు ఖమ్మం రూరల్ మండలం, చిన్నతండ కు చెందిన ఎస్కే.వాజిద్ ను పోలీసులు అరెస్టు చేసినట్లు ఇన్స్పెక్టర్ సాధిక్ పాషా తెలిపారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుడి నుంచి మూడు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో ప్రధాన నిందితుడిపై గతంలో గంజాయి విక్రయం, దొంగతనాలకు సంబంధించి పలు కేసులు ఉన్నట్లు గుర్తించారు. ఆయా కేసుల్లో జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చిన అనంతరం కూడా నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులు పల్లపు వెంకటేష్, అనంతగిరి గ్రామం, సూర్యాపేట జిల్లా, చింతల నరేష్, మాతనగర్, కోదాడ, సూర్యాపేట జిల్లా, కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నేరాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా కొనసాగిస్తూ, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ఏడూళ్ల బయ్యారం పాఠశాలలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక



పినపాక, నవంబర్ 21(పీపుల్స్ డైరీ) : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏడూళ్ల బయ్యారంలో శనివారం 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమరం నాగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు కొమరం నాగయ్య ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షలు, వాటి ఫలితాలు మరియు ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిపై సమగ్ర విశ్లేషణ చేశారు. రాబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు కేవలం 100 రోజులు మాత్రమే సమయం ఉన్నందున, విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు రూపొందించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక గురించి తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధి మరియు విద్యా ప్రమాణాల పెంపు లక్ష్యంగా, పాఠశాల పూర్వ విద్యార్థుల సహకారంతో, తల్లిదండ్రుల పూర్తి అంగీకారంతో సాయంత్రం 5:30 గంటల నుండి రాత్రి 8:30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థుల సమిష్టి సహకారంతో ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే ప్రధాన లక్ష్యం అని ప్రధానోపాధ్యాయులు ఆకాంక్షించా రు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం పాఠశాల యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయానికి తల్లిదండ్రులు తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాటు సారా విక్రయదారులపై బైండోవర్ కేసులు



పినపాక, నవంబర్ 21(పీపుల్స్ డైరీ) : పినపాక మండలంలో నాటు సారా విక్రయాలకు పాల్పడుతున్న ఏడుగురిపై ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టారు. వివిధ గ్రామపంచాయతీలకు చెందిన ఏడుగురిని గుర్తించి పినపాక తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ కేసులు నమోదు చేసి హెచ్చరికలు జారీ చేశారు. మండలంలోని ఎల్చిరెడ్డిపల్లి గ్రామపంచాయతీకి చెందిన ఇద్దరు, భూపాలపట్నం గ్రామపంచాయతీకి చెందిన ముగ్గురు, దుగినపల్లి గ్రామపంచాయతీకి చెందిన ఇద్దరు నాటు సారా విక్రయదారులను ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వీరిని పినపాక తహసీల్దార్ కార్యాలయంలో హాజరుపరిచి బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా పినపాక తహసీల్దార్ జి. శ్రీనివాసరావు నాటు సారా విక్రయాలకు పాల్పడవద్దని వారిని మందలించారు. బైండోవర్ అయిన అనంతరం ఏడాది కాలంలో మళ్లీ నాటు సారా విక్రయాలు చేస్తూ పట్టుబడితే రూ.లక్ష జరిమానాతో పాటు ఏడాది జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. మండలంలో నాటు సారా తయారీ, విక్రయాలు, అక్రమ రవాణాపై నిరంతర నిఘా కొనసాగిస్తామని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు.

తిరుమలాయపాలెం పీఎస్‌ను సందర్శించిన సీపీ



ఖమ్మం, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది పనితీరు పరిశీలించారు. సీసీటీఎన్ఎస్ వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, రహదారి భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని పోలీస్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. అలాగే, పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి పరిష్కరించాలని, కేసుల దర్యాప్తు పురోగతిని నిరంతరం సమీక్షించాలని, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందేలా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి విధినిర్వహణపై పలు సూచనలు చేశారు.

జిల్లా అభివృద్ధి ప్రణాళికను పకడ్బందీగా రూపొందించాలి

ప్రతి శాఖకు నిర్దిష్ట లక్ష్యాలు, స్వల్పకాలిక, దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలి : జిల్లా కలెక్టర్





ఖమ్మం, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : ఖమ్మం జిల్లా అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో జిల్లా అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన పై కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ పారస్ కుమార్‌లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి శాఖ తమ లక్ష్యాలను స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలుగా విభజించుకుని, నిర్దేశిత గడువులోగా వాటి సాధనకు పక్కా కార్యాచరణతో ఉండాలన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలతో పాటు విద్యుత్, పునరుత్పాదక ఇంధన, తాగునీటి రంగాల అభివృద్ధి లక్ష్యాలపై చర్చించారు. వ్యవసాయ రంగంలో భాగంగా 2032 మార్చి నాటికి రైతుల నికర ఆదాయాన్ని 15 శాతం మేర పెంచడం, 5 వేల ఎకరాల్లో లాభదాయక సాగు పద్ధతులను విస్తరించడం, డ్రోన్ల వినియోగం, యాంత్రీకరణ ప్రణాళిక చేయాలన్నారు. ఉద్యానవన శాఖ పరిధిలో ఆయిల్ పామ్ సాగు విస్తరణతో పాటు డ్రిప్ ఆటోమేషన్ పెంచాలని, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 2030 నాటికి పశువుల్లో గాలికుంటు, పీపీఆర్, రేబిస్ వ్యాధుల పూర్తి నిర్మూలన, 4 వేలకు పైగా పశువుల షెడ్ల నిర్మాణం, పశుగ్రాస క్షేత్రాల అభివృద్ధి, మత్స్య శాఖ ద్వారా చెరువుల అభివృద్ధి, ఆధునిక మత్స్య మార్కెట్ల నిర్మాణం, మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డుల మంజూరు వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం నూతన 33/11 కేవీ సబ్-స్టేషన్ల నిర్మాణం, ఓవర్‌లోడ్ ఫీడర్ల విభజన, భూగర్భ కేబుల్ పనులు, వినియోగదారుల ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని తెలిపారు. టీజీరెడ్కో ద్వారా పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్, మోడల్ సోలార్ గ్రామాల పథకాల కింద సోలార్ రూఫ్‌టాప్‌లు, వ్యవసాయ సోలార్ పంపుసెట్లు, ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటును వేగవంతం చేయాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చేతిపంపులు, పైప్‌లైన్ల మరమ్మతులు, నూతన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల నిర్మాణ కార్యాచరణ కు కలెక్టర్ సూచించారు. సెర్ప్ శాఖ పరిధిలో జిల్లాలో మహిళలను స్వయం సహాయక సంఘాల్లో భాగస్వాములను చేయడం, వారిలో సగం మందిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దే దిశగా ప్రణాళికలు రూపొందించడం వంటి లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఉదాహరణగా తెలిపారు. సాగునీటి శాఖ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు అందించడం, జాతీయ, రాష్ట్ర రహదారుల అభివృద్ధి, సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమల వల్ల కలిగే సమస్యల పరిష్కారం వంటి అంశాల పై శాఖల వారీగా లక్ష్యాలు రూపొందించాలని అన్నారు. అంతకుముందు కలెక్టర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్ష చేశారు. ప్రజల దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, త్వరితగతిన పరిష్కార చర్యలు తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తు తిరస్కారంపై కారణాలతో సహా దరఖాస్తుదారునికి వ్రాతపూర్వకంగా తెలిపాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఎంపిడిఓ లు, తదితరులు పాల్గొన్నారు.

చివరి తడి కోసం సీతారామ జలాలు విడుదల

రైతుల అభ్యర్థనపై తక్షణమే స్పందించి నీటి విడుదలకు మంత్రి తుమ్మల ఆదేశాలు



ఖమ్మం, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : పంటలు ఎండిపోకుండా చివరి తడి అందించి ఆదుకోవాలంటూ రైతులు చేసిన విజ్ఞప్తిపై రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే స్పందించారు. రైతుల ఇబ్బందుల ను దృష్టిలో ఉంచుకుని సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను విడుదల చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు సాగునీటిని విడుదల చేశారు. ప్రస్తుతం పంటలు కీలక దశలో ఉన్నాయని, చివరి తడి అందక పోతే దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సాగునీటి అవసరాన్ని వివరిం చి, వెంటనే నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. రైతుల విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించిన మంత్రి తుమ్మల అధికారులతో మాట్లాడి నీటి విడుదలకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతో వైరా--ఏస్కూరు, అన్నపురెడ్డిపల్లి, రామచంద్రపురం మేజర్ కాలువలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాల ను అధికారులు విడుదల చేశారు. విడుదల చేసిన నీరు ఆదివారం నాటికి మేజర్ కాలువలకు చేరుకోనుంది. తద్వారా ఆయా కాలువల పరిధిలోని పంటలకు చివరి తడి అందే అవకాశం ఏర్పడింది. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విడుదల చేసిన గోదావరి జలాలను కేవలం పంటల సాగు అవసరాలకే వినియోగించుకోవా లని మంత్రి తుమ్మల సూచించారు. నీటిని వృథా చేయకుండా పొలాలకు అందేలా రైతులు సహకరించాలని కోరారు. చివరి తడి అందించడం ద్వారా పంటలను కాపాడి రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. రైతుల విజ్ఞప్తికి వెంటనే స్పందించి సాగునీరు విడుదల చేయించిన మంత్రి తుమ్మల నిర్ణయంపై ఆయా ప్రాంతాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు..

బీమా పథకం అమలుతీరును పరిశీలించిన ఎంపీడీవో



ఏన్కూర్, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : ఏన్కూరు మండలంలోని రాయమాదారం, కోదండరామపురం గ్రామపంచాయతీల్లో శుక్రవారం ఎంపీడీవో బండి భాస్కరరావు, ఏపీఓ శ్రీదేవి పర్యటించి వివిధ అభివృద్ధి పనులను, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు తీరును పరిశీలించారు.రాయమాదారం గ్రామంలో సర్పంచ్ సోనీతో కలిసి గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి, వివిధ అభివృద్ధి పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. వీబీ-జీ రామ్-జీ పథకం కింద చేపడుతున్న ఫామ్ పాండ్, డ్రెయిన్, సోక్ పిట్, కమ్యూనిటీ సోక్ పిట్ పనులతో పాటు ఆరోగ్య ఉపకేంద్రం పనితీరును పరిశీలించారు. అనంతరం కోదండరామపురం గ్రామపంచాయతీలో సర్పంచ్ బానోత్ సైదమ్మతో కలిసి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అభివృద్ధి పనుల నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి అర్హుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేసి అప్‌లోడ్ చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని, విధుల నిర్వహణలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఖాదర్ మియా, ఉపసర్పంచ్ ఇమ్మడి భద్రం, పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్, బి. రాజేష్, కంప్యూటర్ ఆపరేటర్ పి. రాజశేఖర్, ఎస్.కె. నాని ఖాన్, భూపతి నాని, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





కరకగూడెంలో మండల స్థాయి ఆంగ్ల ప్రతిభ పరీక్ష నిర్వహణ

కరకగూడెం, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ): మండలంలో ఆంగ్ల భాషా ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయి ఆంగ్ల ప్రతిభ పరీక్షను నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో పాఠశాల స్థాయిలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరచి గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కరకగూడెంలో మండల స్థాయి పరీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల బాధ్యురాలు గడ్డం మంజుల, ఆంగ్ల ఉపాధ్యాయురాలి సమక్షంలో నిర్వహించా రు. పరీక్షలో ప్రతిభ కనబరచి విజయం సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల ఆంగ్ల భాషా ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను, మాట్లాడే నైపుణ్యాలను మరియు ఆంగ్ల భాషపై ఆసక్తిని, అభిరుచిని పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

కేసుల దర్యాప్తు నుంచి విచారణ పూర్తయ్యే వరకు సమర్థవంతమైన పర్యవేక్షణ

ఖమ్మం ఉమ్మడి జిల్లా ప్రాసిక్యూషన్ రివ్యూ కమిటీ (డిపి ఆర్సి) సమావేశం

ఖమ్మం, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : కేసుల దర్యాప్తు నుంచి న్యాయస్థానాల్లో విచారణ పూర్తయ్యే వరకు సమర్థవంతమైన పర్యవేక్షణ చేపట్టడం, సాక్ష్యాధారాల సమర్పణలో లోపాలను నివారించడం ద్వారా నిందితులకు శిక్షలు పడే శాతాన్ని గణనీయంగా పెంచడం డిస్ట్రిక్ట్ ప్రాసిక్యూషన్ రివ్యూ కమిటీ ప్రధాన లక్ష్యమని అడిషనల్ డీసీపీ రామానుజం అన్నారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు, అదనపు డీసీపీ రామానుజం అధ్యక్షతన అక్టోబర్ నెలకు సంబంధించిన ఉమ్మడి జిల్లా ప్రాసిక్యూషన్ రివ్యూ కమిటీ సమావేశం శనివారం కోర్టు మానిటరింగ్ సిస్టమ్ కార్యాలయంలో నిర్వహిం చారు. ఈ సమావేశంలో అక్టోబర్ నెలలో నమోదైన గ్రేవ్ అక్సిటల్ కేసులపై ప్రధానంగా సమీక్ష నిర్వహించారు. కేసుల్లో నిందితులు నిర్దోషులుగా విడుదల కావడానికి గల కారణాలు, దర్యాప్తులో జరిగిన లోపాలు, సాక్ష్యాధారాల సమర్పణ, సాక్షుల హాజరు తదితర అంశాలను కేసుల వారీగా క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల్లో గుర్తించిన లోపాలను సరిది ద్దుకుని, భవిష్యత్తులో ఇలాంటి లోపాలు పునరావృతం కాకుండా అవసరమైన నివారణ చర్యలు చేపట్టాలని అదనపు డీసీపీ అధికారులకు సూచించారు. దర్యాప్తు అధికారులు, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు (సీడీఓస్), సెషన్స్ కోర్టు లైజన్ ఆఫీసర్లు సమన్వయంతో పనిచేస్తూ, కేసుల దర్యాప్తు నుంచి కోర్టు విచారణ వరకు ప్రతి అంశంలో తగిన జాగ్రత్తలు తీసుకోవా లని సూచించారు. అలాగే కోర్టు కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, సాక్ష్యాధారాల సేకరణ, కేసు రికార్డుల నిర్వహణ, సాక్షుల హాజరు, చార్జ్‌షీట్ల నాణ్యత తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్. ఉపేందర్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ పివిడి లక్ష్మి, ఏ.ఫణి కుమార్, ఉమ్మడి జిల్లా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044, e-mail : peoplesdairydaily@gmail.com



భారతీయ రుచులు భళా..

- అంతర్జాతీయ వేదికపై మన వంటకాల సత్తా...
- టాప్ టెన్‌లో చోటుదక్కించుకున్న రెండు వంటకాలు
- కూరల ఖ్యాతి ఖండాంతరాలు!
- ప్రముఖ ఫుడ్‌గైడ్ టేస్ట్ అట్లాస్ విడుదల

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : భారతీయ వంటకాల రుచి మరోసారి అంతర్జాతీయ వేదికపై సత్తా చాటింది. ప్రముఖ ఫుడ్ గైడ్ టేస్ట్ అట్లాస్ విడుదల చేసిన ప్రపంచంలోని అత్యుత్తమ స్టూ వంటకాల జాబితాలో భారత్‌కు చెందిన రెండు ప్రసిద్ధ వంటకాలు టాప్-10లో చోటు సంపాదించుకున్నాయి. మాంసాహార ప్రియుల ఫేవరెట్ బటర్ చికెన్ నాలుగో స్థానంలో నిలవగా.. శాకాహారుల అభిమాన వంటకం షాహీ పనీర్ ఆరో ర్యాంక్ దక్కించుకుంది.

బటర్ చికెన్ లేదా ముర్గ్ మఖానీకి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకమైన అభిమానులున్నారు. ఢిల్లీలో పుట్టిన ఈ వంటకం నేడు అంతర్జాతీయ రెస్టారెంట్లలోనూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పెరుగు, అల్లం వెల్లుల్లి పేస్ట్, మసాలాలతో చికెన్ ముక్కలను నానబెట్టి తందూరీ పద్ధతిలో ఉడికిస్తారు. అనంతరం టమాటా, వెన్న, క్రీమ్, సుగంధ ద్రవ్యాలతో తయారుచేసిన చిక్కటి గ్రేవీలో కలుపుతారు. కారం, తీపి, పులుపు, వెన్న రుచుల కలయిక ఈ వంటకానికి ప్రత్యేకత. వేడివేడి నాన్, రోటీ, జీరా రైస్‌తో తింటే ఆ రుచే వేరు. ఈ ప్రత్యేకతలే ప్రపంచ జాబితాలో నాలుగో స్థానాన్ని తెచ్చిపెట్టాయి. శాకాహార ప్రియుల మనసు దోచుకునే షాహీ పనీర్ కూడా ప్రపంచస్థాయిలో మెరిసింది. ఉత్తర భారతదేశంలో ప్రసిద్ధి చెందిన ఈ వంటకంలో మెత్తటి పనీర్ ముక్కలను టమాటా, ఉల్లిపాయ, జీడిపప్పు, క్రీమ్‌తో తయారుచేసిన గ్రేవీలో ఉడికిస్తారు. యాలకులు, కుంకుమపువ్వు వంటి సుగంధ ద్రవ్యాలు దీనికి రాజసమైన రుచిని అందిస్తాయి. కొద్దిపాటి తీపి, మసాలాల ఘాటు, క్రీమీ గ్రేవీ కలగలిసిన ఈ కూర నాన్, పరాటా, పులావ్‌తో ఎంతో రుచిగా ఉంటుంది. అందుకే ప్రపంచ అత్యుత్తమ స్టూల జాబితాలో ఆరో స్థానం దక్కించుకుంది.

ఇతర దేశాల వంటకాలకూ గుర్తింపు

ఈ జాబితాలో ఇతర దేశాల సంప్రదాయ వంటకాలూ పోటాపోటీగా నిలిచాయి. పెరూకు చెందిన మేక మాంసపు వంటకం 'సెకో డి కబ్రిటో', థాయ్‌లాండ్‌కు చెందిన కొబ్బరిపాలు, వేరుశెనగలతో తయారుచేసే 'ఫనాంగ్ కర్రీ', టర్కీ సంప్రదాయ వంటకం 'హుంకార్ బెయెండి', ఫిలిప్పీన్స్‌కు చెందిన వేరుశెనగ గ్రేవీ వంటకం 'కరే కరే' ఈ జాబితాలో ప్రత్యేక గుర్తింపు పొందాయి.

భారతీయ రుచులకు అంతర్జాతీయ కిరీటం!

మాంసాహార వంటకం బటర్ చికెన్, శాకాహార వంటకం షాహీ పనీర్ రెండూ ప్రపంచ అత్యుత్తమ స్టూల జాబితాలో టాప్-10లో నిలవడం భారతీయ ఆహార వైవిధ్యానికి నిదర్శనం. దేశీయ రుచులను విదేశీయులూ ఇష్టపడుతున్నారనడానికి ఈ గుర్తింపు మరో ఉదాహరణ. మొత్తానికి మన కూరల ఘుమఘుమలకు ప్రపంచమే ఫిదా అవుతోంది!

అమెరికాలో రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

దీంతో జింకను ఢీకొట్టిన వాహనం రోడ్డుపై నిలిచిపోయింది.

అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన సరకు రవాణా వ్యాన్ ఆ కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాయితేజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అదే కారులో ఉన్న మరో వ్యక్తి తీవ్రంగా గాయపడటంతో అతడ్ని హెలికాప్టర్ ద్వారా పోలీసులు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇక, ప్రమాదానికి కారణమైన వ్యాన్.. మరో రెండు వాహనాలు ఢీకొట్టడంతో మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

మునుగోడుకు చెందిన వీరమళ్ల ప్రసాద్, శ్రీకన్య దంపతుల తమ పెద్ద కుమారుడైన సాయితేజను అమెరికాలో పై చదువులకు పంపారు. అక్కడ ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడతాడని ఆశించిన ఆ తల్లిదండ్రులకు.. అతడి మరణవార్త తీరని శోకాన్ని మిగిల్చింది. అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సాయితేజ మృతి చెందడంతో మునుగోడులో విషాదఛాయలు అలుముకున్నాయి.

తమ కుమారుడి భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు, వారం రోజుల క్రితం కొడుకు ఉద్యోగం సాధించడంతో సంబరపడిపోయారు. కానీ, వారి ఆనందాన్ని చూసి ఆ దేవుడికి అసూయ పుట్టిందేమో రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబలించింది. తమ కుమారుడు ఇక లేడన్న వార్త కన్నీటిని మిగిల్చింది. సాయితేజ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. చేతికి అందొచ్చిన కుమారుడు ఇలా దేశం కాని దేశంలో రోడ్డు ప్రమాదంలో విగతజీవిగా మారడం ఆ కుటుంబం తట్టుకోలేకపోతోంది.

రిసెప్షన్ స్థలం పరిశీలించిన కాంటెస్ట్ కార్పొరేటర్లు

పీపుల్స్‌డైరీ-వరంగల్ : వరంగల్ నగర తొలి మేయర్ తూర్పు మాజీ శాసన సభ్యులు నన్నపనేని నరేందర్ దంపతుల కుమారుడి రిసెప్షన్ వేడుకలు ఆదివారం ఖమ్మం ప్రధాన రహదారి వాల్ మార్ట్ స్థలం లో ఘనంగా నిర్వహించనున్న సందర్భంగా 39,32 వ డివిజన్ బిఆర్ఎస్ కాంటెస్టెడ్ కార్పొరేటర్లు బజ్జూరి వాసు, పొగాకు సందీప్ ఇతర కార్యకర్తలు పర్యవేక్షించారు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, పార్టీ శ్రేణులు పాల్గొననున్న సందర్భంగా ఆహ్వానితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్థలం ప్రాంగణమంతా స్టేజి అరేంజ్మెంట్,గ్రౌండ్ లో సీటింగ్ లు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు పర్యవేక్షణలో టి రమేష్, ఎండి ఇక్బాల్, కిరణ్, విజయ్, బాలు తదితరులు పాల్గొన్నారు



రిటైర్మెంట్ తీసుకొని వస్తున్నా.. కాచుకోండి!

వెంకటాపూర్‌లో పూర్తి స్థాయి జర్నలిస్టు అవతారం ఎత్తనున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు..!

మండలాన్నంతా దున్నేస్తాడట...

పీపుల్స్‌డైరీ-వెంకటాపూర్ : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో ఇప్పుడు అందరి నోటా ఒకటే చర్చ. ప్రభుత్వ ఉపాధ్యాయుడు పూర్తి జర్నలిస్టు అవతారం ఎత్తనున్నాడా..? అని.

కొన్ని నెలల్లో నేను రిటైర్మెంట్ తీసుకొని వస్తున్నా.. మీరు సిద్ధంగా ఉండండి.." అంటూ కొంతమంది జర్నలిస్టులకు తెలియజేస్తున్నాడని మండలంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ మాట విన్న దగ్గర నుంచి మండలంలో చర్చ మొదలైంది. అసలు ఇది నిజమా..? లేక హెచ్చరికా..? అని అందరూ ఆలోచిస్తున్నారు.

నేను వస్తే ఇక మండలంలో దున్నుడే....

"నేను వస్తే ఇక మండలంలో దున్నుడే.. దానికి మీ సపోర్ట్ కావాలి.." అని ఆ ఉపాధ్యాయుడు చెబుతున్నట్లు సమాచారం.

ఉపాధ్యాయుడిగా పిల్లలకు పాఠాలు చెప్పాల్సిన వ్యక్తి.. రిటైర్మెంట్ తర్వాత దున్నేస్తానని చెప్పడం ఏంటి..? అని సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రిటైర్మెంట్ అంటే విశ్రాంతి.. కానీ ఇక్కడ రిటైర్మెంట్ అంటే దున్నుడుకు సిద్ధం అన్నట్లుగా ఉందని అంటున్నారు.

దున్నుడు అంటే ఏంటి..? ఎవరిని దున్నుతాడు..? ఎందుకు దున్నుతాడు..? నిజాల కోసం దున్నుతాడా..? లేక తనకు నచ్చని



వారిని దున్నుతాడా..? అనే ప్రశ్నలు కూడా వస్తున్నాయి.

ఒక ఉపాధ్యాయుడు ఇలా మాట్లాడటం.. మండలంలో చాలా మందిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఉపాధ్యాయుడు అంటే సమాజానికి ఆదర్శం. అలాంటి వ్యక్తి దున్నుడు అనే మాట వాడటం సరైనదేనా..? అని పెద్దలు కూడా ప్రశ్నిస్తున్నారు.

ఇప్పటికే సగం ముసుగులో.....

ఇప్పటికే సగం ముసుగులోనే ప్రజా ప్రతినిధులను.. ప్రజలను.. ప్రభుత్వ ఉద్యోగులను పట్టిపీడిస్తున్నాడని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఇంకా ఉద్యోగంలో ఉండగానే ఇంత ఇబ్బంది పెడుతుంటే.. రిటైర్మెంట్ తీసుకొని పూర్తిగా జర్నలిస్టు అవతారం ఎత్తితే.. మండలం పరిస్థితి ఏంటి..? జిల్లా పరిస్థితి ఏంటి..? అని సామాన్య ప్రజలు భయపడుతున్నారు.

సగం ముసుగులోనే ఇంత ఉంటే.. పూర్తి ముసుగు తీసేస్తే ఇంకెంత ఉంటుంది..? అని మండలంలో చర్చ జరుగుతోంది. ప్రజా ప్రతినిధులు సైతం ఈ విషయంలో ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారని సమాచారం.

ప్రభుత్వ ఉద్యోగులు కూడా తమ పని చేసుకోవడానికి భయపడుతున్నారని.. ఎక్కడ తమ పేరు వస్తుందో.. ఎక్కడ తమను ఇబ్బంది పెడతారో అని ఆందోళన చెందుతున్నారని చెబుతున్నారు.

విద్యాశాఖ విచారణ చేయాలి..!

అసలు ఆ ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై విద్యాశాఖ విచారణ చేయాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

అతను జీతం తీసుకుంటున్న ఉపాధ్యాయ వృత్తి కంటే.. జర్నలిస్టు వృత్తిపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నాడనే ఆరోపణలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ జీతం తీసుకుంటూ.. ప్రభుత్వ పాఠశాలలో పని చేయకుండా.. జర్నలిజం చేస్తే.. నష్టపోయేది పిల్లలే కదా..? అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. పిల్లల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్నారా..? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రిటైర్మెంట్ కు ఇంకా కొన్ని నెలలు ఉండగానే.. జర్నలిస్టు అవతారం కోసం ఇంత హడావుడి ఎందుకు..? పాఠశాలపై దృష్టి ఎందుకు లేదు..? పిల్లల చదువుపై శ్రద్ధ ఎందుకు లేదు..? అని కూడా ప్రశ్నిస్తున్నారు.

ఉపాధ్యాయుడు పాఠశాలకు సక్రమంగా వస్తున్నాడా..? పిల్లలకు పాఠాలు చెబుతున్నాడా..? లేక పాఠశాల సమయంలో కూడా జర్నలిజం పనుల్లోనే ఉంటున్నాడా..? అనేది విచారణలో తేలాలని కోరుకుంటున్నారు.

మండలం.. జిల్లా పరిస్థితి ఏంటి..?

ఇక పూర్తిగా జర్నలిస్టు అవతారం ఎత్తితే మండలం పరిస్థితి ఏంటి..? జిల్లా పరిస్థితి ఏంటి..? అని సామాన్య ప్రజలు భయపడుతున్నారు.

ఇప్పటికే సగం ముసుగులోనే ఇంత భయం ఉంటే.. పూర్తిగా వస్తే ఇంకెంత భయం ఉంటుంది..? అని అంటున్నారు. ప్రజలు ప్రశాంతంగా బతకాలని కోరుకుంటున్నారు. గొడవలు.. బెదిరింపులు.. భయాలు వద్దని అంటున్నారు.

మండలంలో ప్రశాంత వాతావరణం ఉండాలి.. ప్రజలు భయం లేకుండా బతకాలి.. అంటే అధికారులు ఇప్పుడే స్పందించాలి.. అని కోరుకుంటున్నారు.

ఒకే టార్గెట్‌పై రెండు మిస్సైల్స్..

అదానీ బఫీరా క్షిపణి ఎంట్రీతో శత్రువులకు ఇక చుక్కలే..!

భారత రక్షణ రంగంలో మరో కీలక ముందడుగు పడింది. అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ రూపొందించిన అత్యాధునిక ట్యాంక్ విధ్వంసక గైడెడ్ క్షిపణి వ్యవస్థ 'బఫీరా ూ1' రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్‌లో విజయవంతంగా ప్రదర్శించారు. నవంబర్ 20న నిర్వహించిన ఈ ప్రదర్శనలో భారత సైన్యం, సైనిక వ్యవహారాల శాఖ (ణహీూ), రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

శత్రు ట్యాంకులను సుదూరం నుంచే గుర్తించి ధ్వంసం చేయడం, పగలు, రాత్రి తేడా లేకుండా లక్ష్యాలను ఛేదించడం ఈ వ్యవస్థ ప్రత్యేకత. ముఖ్యంగా ఒకే లక్ష్యంపై రెండు క్షిపణులను ప్రయోగించే సామర్థ్యం బఫీరా ూ1ను మరింత ప్రత్యేకంగా నిలబెడుతోంది. భారత సైన్యం భవిష్యత్తు యుద్ధ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ దేశీయ రక్షణ సాంకేతికతలో మరో కీలక అడుగుగా భావిస్తున్నారు.

8 కిలోమీటర్ల దూరం నుంచే శత్రు ట్యాంకులపై దాడి!

బఫీరా AT1 ప్రధాన ప్రత్యేకత దాని సుదూర దాడి సామర్థ్యం. ఈ వ్యవస్థ ద్వారా 8 కిలోమీటర్ల దూరంలోని శత్రు సాయుధ వాహనాలు, ట్యాంకులను లక్ష్యంగా చేసుకోవచ్చు. కంపెనీ వెల్లడించిన వివరాల ప్రకారం, క్షిపణి సాంకేతిక నిర్మాణం 10 కిలోమీటర్ల వరకు గైడెడ్ దాడులకు మద్దతు ఇచ్చే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ప్రస్తుతం భూమి నుంచి ప్రయోగించే కొన్ని ట్యాంక్ విధ్వంసక క్షిపణుల సుమారు 4 కిలోమీటర్ల పరిధితో పోలిస్తే ఇది దాదాపు రెట్టింపు దూరం. దీనివల్ల శత్రు ట్యాంకులకు దగ్గరగా వెళ్లకుండానే సుదూరం నుంచి దాడులు నిర్వహించే అవకాశం ఉంటుంది.

లేజర్ బీమ్ గైడెన్స్.. ఎలక్ట్రానిక్ జామింగ్‌కు చెక్!

ఈ క్షిపణిలో అత్యాధునిక లేజర్ బీమ్-రైడింగ్ గైడెన్స్ టెక్నాలజీని ఉపయోగించారు. సాధారణంగా కొన్ని క్షిపణులు రేడియో సిగ్నల్స్ ఆధారంగా లక్ష్యాన్ని చేరుకుంటాయి. కానీ బఫీరా ూ1 లేజర్ కిరణాన్ని అనుసరిస్తూ లక్ష్యం వైపు దూసుకెళ్తుంది. దీంతో శత్రు దేశాలు ఉపయోగించే ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, జామింగ్ వ్యవస్థల ప్రభావానికి గురయ్యే అవకాశం గణనీయంగా తగ్గుతుంది. ఆధునిక యుద్ధాల్లో ఎలక్ట్రానిక్ జామింగ్ కీలక సవాలుగా మారుతున్న నేపథ్యంలో ఈ టెక్నాలజీకి ప్రాధాన్యత పెరిగింది.

ఒకే టార్గెట్‌పై రెండు క్షిపణులు.. ప్రత్యేక దాడి సామర్థ్యం

బఫీరా AT1లో మరో కీలకమైన ఫీచర్ రెండు క్షిపణులను ఒకే లక్ష్యంపై వరుసగా ప్రయోగించే సామర్థ్యం. వీటిని ఒకే లేజర్ బీమ్ మార్గంలో ప్రయోగించవచ్చు. మొదటి క్షిపణి శత్రు ట్యాంకులోని యాక్టివ్ ప్రొటెక్షన్ సిస్టమ్ (ూూూ)ను లక్ష్యంగా చేసుకునేలా రూపొందించారు. రెండో క్షిపణి ట్యాంకు రక్షణను ఛేదించి దానిని ధ్వంసం చేసేలా రూపొందించారు. ఆధునిక యుద్ధ ట్యాంకుల్లో ఉండే రక్షణ వ్యవస్థలను ఎదుర్కోవడానికి ఈ విధానం ఉపయోగపడుతుంది.

ఒక్క వాహనంలో 12 క్షిపణులు..

పగలు, రాత్రి దాడులు

ఈ పూర్తి క్షిపణి వ్యవస్థను అదానీ డిఫెన్స్ రూపొందించిన 4ఐ4 హై మొబిలిటీ ఆర్మర్డ్ వాహనంపై అమర్చారు. ఇందులో అనేక ప్రత్యేక సాంకేతిక సదుపాయాలు ఉన్నాయి.

- ఆటోమేటిక్ లాంచర్‌పై సిద్ధంగా ఉండే 4 క్షిపణులు.
- వాహనంలో అదనంగా నిల్వ ఉంచే 8 క్షిపణులు.
- ఒక్కో వాహనంలో మొత్తం 12 క్షిపణుల సామర్థ్యం.
- పగటిపూట లక్ష్యాలను గుర్తించేందుకు టీవీ విజన్ సిస్టమ్.
- రాత్రి వేళల్లో లక్ష్యాలను గుర్తించేందుకు థర్మల్ ఇమేజింగ్ సదుపాయం.
- ఆటోమేటిక్ టార్గెట్ ట్రాకింగ్ టెక్నాలజీ.
- దాడి చేసిన వెంటనే వాహనం మరో ప్రాంతానికి వేగంగా వెళ్లే సామర్థ్యం.
- ఈ వ్యవస్థ ద్వారా సైనికులు రక్షిత ప్రాంతం నుంచి క్షిపణులను ప్రయోగించి, శత్రు దాడులకు గురయ్యే ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు.

పోఖ్రాన్‌లో నాలుగు క్షిపణుల ప్రదర్శన

నవంబర్ 20న నిర్వహించిన ప్రదర్శనలో మొత్తం నాలుగు యాంటీ ట్యాంక్ క్షిపణులను విజయవంతంగా ప్రయోగించినట్లు అదానీ డిఫెన్స్ వెల్లడించింది. ఈ సందర్భంగా పగలు, రాత్రి వేళల్లో లక్ష్య ఛేదన సామర్థ్యాన్ని పరీక్షించారు. ఒకే లేజర్ బీమ్ ద్వారా రెండు క్షిపణులను వరుసగా ప్రయోగించే సామర్థ్యాన్ని కూడా ప్రదర్శించారు. అంతేకాకుండా, విస్తరించిన పరిధిలో గగనతల లక్ష్యాన్ని ఛేదించే సామర్థ్యాన్ని కూడా ప్రదర్శించారు. అనంతరం పూర్తి క్షిపణి వ్యవస్థను అధికారులకు ప్రత్యక్షంగా చూపించారు. ఈ ప్రదర్శనను చీజచీజ (చీశీ జశీర్ చీశీ జశీఎఅ్ఎవత్) విధానంలో నిర్వహించారు.

భారత సైన్యం అవసరాలకు అనుగుణంగా రూపకల్పన

భారతదేశంలోని భిన్నమైన భౌగోళిక పరిస్థితులు, వాతావరణం, సైనిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని బఫీరా ూ1 వ్యవస్థను అభివృద్ధి చేసినట్లు అదానీ డిఫెన్స్ తెలిపింది. ఇందుకోసం సుమారు 18 నెలల పాటు డిజైన్, అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించింది. క్షిపణి, ఆటోమేటిక్ లాంచర్, పగలు-రాత్రి నిఘా వ్యవస్థ, సాయుధ వాహనం.. ఇలా మొత్తం సమగ్ర పోరాట వ్యవస్థను రూపొందించడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత.

భారత సైన్యం విధ్వంసక సామర్థ్యాలకు మరో అస్త్రం

ప్రస్తుతం భారత సైన్యం వద్ద మిలన్-2ఐ, కొంకుర్స్-వీ వంటి యాంటీ ట్యాంక్ క్షిపణి వ్యవస్థలు ఉన్నాయి. స్టైక్ క్షిపణులను కూడా సైన్యంలోకి తీసుకున్నారు. జావెలిన్ క్షిపణి వ్యవస్థల సేకరణ దిశగా కూడా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో బఫీరా ూ1 అందుబాటులోకి వస్తే భారత సైన్యానికి సుదూరం నుంచి శత్రు ట్యాంకులను ఎదుర్కొనే మరో మొబైల్ క్షిపణి వ్యవస్థ లభించే అవకాశం ఉంది. ఈ ప్రదర్శన ద్వారా అదానీ డిఫెన్స్ తన సాంకేతిక సామర్థ్యాన్ని, దేశీయంగా అధునాతన రక్షణ వ్యవస్థలను అభివృద్ధి చేసే సామర్థ్యాన్ని చాటింది.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదును విజయవంతం చేయాలి : ఎంపీడీవో

కరకగూడెం, నవంబర్ 21 (పీపుల్స్ డైరీ) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమాన్ని మండలంలో విజయవంతం చేయాలని కరకగూడెం ఎంపీడీవో శ్రీనివాస్ రావు పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం సమాజంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భద్రత మరియు సామాజిక రక్షణను బలోపేతం చేసేందుకు ఈ పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. ఇప్పటివరకు ఏ ఇతర బీమా పథకాల పరిధిలోకి రాని కుటుంబాలకు కూడా జీవిత బీమా సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

రూ.5 లక్షల బీమా భరోసా:

ఈ పథకం కింద కుటుంబ పెద్దకు రూ.5 లక్షల వరకు జీవిత బీమా రక్షణ కల్పిస్తారని వివరించారు. కుటుంబ పెద్ద అకస్మాత్తుగా మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. పూర్తిగా ఉచిత పథకమని, లబ్ధిదారులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదని, ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుందని స్పష్టం చేశారు.

నమోదు షెడ్యూల్:

ఈ నమోదు కార్యక్రమం ఈనెల 19వ తేదీ నుండి వచ్చే నెల డిసెంబర్ 18వ తేదీ వరకు నిర్వహిస్తారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో నాలుగు ఫేజ్ లలో విడతల వారీగా ఈ నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు.

